భవిష్యత్ ప్రజాపాలన
మా వార్త రేపటి భవిష్యత్తుకు నిదర్శనం
తెలుగు దినపత్రిక
bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in
ASN NEWS
ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 271 శనివారం, అక్టోబర్ 31, 2026, పేజీలు - 12 వెల : 1 /-

మియాపూర్ భూములను విక్రయిస్తాం!

- రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానివే.. సుప్రీంకోర్టు తీర్పుపై సీఎం హర్షం
- భూముల విక్రయం ద్వారా వచ్చే నిధులు నీటిపారుదల, విద్యా, వైద్య రంగాలకు
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు.. మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం
- ఢిల్లీలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్ 30 : మియాపూర్‌లో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానికి చెందుతాయని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన సర్వోన్నత న్యాయ స్థానానికి ధన్యవాదాలు తెలిపారు. మియాపూర్ భూములను విక్రయించి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామని ప్రకటించారు. ముఖ్యంగా నీటిపారుదల, విద్యా, వైద్య తదితర కీలక రంగాలకు ఈ నిధులను కేటాయిస్తామని వెల్లడించారు. శుక్రవారం ఢిల్లీలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం ఈ వివరాలు వెల్లడించారు. మియాపూర్ భూముల విక్రయంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రేవంత్‌రెడ్డి మిగతా2లో...

ప్రజల జీవితాల్లో మార్పే వాస్తవ అభివృద్ధి

- 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రతకు ప్రాధాన్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్,అక్టోబర్ 30 : ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన అభివృద్ధి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఆర్థిక వృద్ధి కేవలం గణాంకాలకే పరిమితం కాకు ండా ప్రతి కుటుంబానికి మిగతా2లో...

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

- ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ
- ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాలకు తాత్కాలిక మినహాయింపు

న్యూఢిల్లీ,అక్టోబర్ 30 : దేశవ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అక్టోబర్ 30న అధికారిక ప్రకటన జారీ చేసింది. ఎన్నికలు జరగనున్న మిగతా2లో...

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

- ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలి
- ఫిర్యాదులపై తక్షణ స్పందన.. నిష్పక్షపాత విచారణకు ఆదేశాలు

అమరావతి,అక్టోబర్ 30 : తీర ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల పరిశీలకులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి శుక్రవారం సీడీఎంఏ సంపత్‌కుమార్, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, డీఐజీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిగతా2లో...

మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్సే

- సుప్రీంకోర్టులో ఎనిమిదేళ్ల పాటు న్యాయపోరాటం చేశాం
- భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకించిన హరీశ్‌రావు

హైదరాబాద్,అక్టోబర్ 30 : మియా పూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే సుప్రీంకోర్టులో మిగతా2లో...

హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

- తెలంగాణకు ప్రకటించిన మూడు కారిడార్లకు త్వరగా అనుమతులు ఇవ్వాలి
- కొత్త రైల్వే మార్గాల మంజూరుకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- అనంతారంలో మెగా ఫ్రైట్ నిర్వహణ డిపో ఏర్పాటు చేయండి

2లో

రైతాంగ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- రూ.2 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

2లో

సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

- ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 బోనస్
- నవంబర్ 5న బ్యాంకు ఖాతాల్లో జమ.. భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్ 30 : సింగరేణి కార్మికు లకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. నవం బర్ 5న కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఒక్కో అర్హత కలిగిన కార్మికుడికి గరిష్టంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం 38 వేల మందికి రూ.419 కోట్లు చెల్లించనున్నారు. ఇప్పటికే దసరా లాభాల వాటా కింద రూ.600 కోట్లు చెల్లించగా, మిగతా2లో...

ప్రజల కోసమే కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం

- రైతులు, యువత, ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం
- పంటలు వేయొద్దన్న సీఎం అధికారంలో ఉండొద్దు
- ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ఇంద్రవెల్లి,అక్టోబర్ 30 : ప్రజలకు మేలు చేసేందుకే కొత్త రాజకీయ శక్తిగా ముందుకు వచ్చామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఆదివాసీల అభివృద్ధి, విద్య, వైద్యం, సాగునీటి సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాలోని 750 గ్రామాలకు కనీసం పాఠశాలలు కూడా మిగతా2లో...

హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

న్యూఢిల్లీ,అక్టోబర్ 30 : తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైలు మార్గాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. హైదరా బాద్ పుణె, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్లకు సంబంధించి కేంద్రం పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి పంపినట్లు తెలిపారు. కేంద్రం త్వరగా మార్గాల అమరికను ఖరారు చేస్తే భూసేకరణ ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం సమావేశమై తెలంగాణకు అవసరమైన కీలక రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. వికారాబాద్‌కృష్ణా మధ్య 130 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నందున ఆ ప్రాంతాన్ని సిమెంట్, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న సుమారు 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డు పక్కనే ప్రాంతీయ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేలా మార్గాన్ని ఖరారు చేయాలని సీఎం కోరారు. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. డోర్నకల్‌గద్వాల, కల్వకుర్తి మాచర్ల, కాచిగూడజగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరుఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్‌లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ (8 కి.మీ.) రైల్వే మార్గాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించిన మెగా కోచింగ్, సరుకు రవాణా నిర్వహణ డిపోను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిపో కోసం అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ భూములను విక్రయిస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఈ భూముల విక్రయం, వాటి ద్వారా వచ్చే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించినట్లు వివరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు వాటిని ప్రజా ప్రయోజనాలకు వినియోగించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. మియాపూర్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విలువైన భూములను ఆక్రమించేందుకు గత బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని సీఎం ఆరోపించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్ పేర్లను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే భూ ఆక్రమణలపై పోరాటం చేశానని తెలిపారు.

కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ, మంచిరేవుల ప్రాంతాల్లోని భూముల పరిరక్షణకు న్యాయపోరాటం చేసినట్లు వివరించారు. గుర్రంగూడలోని భూములు అటవీ భూములేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కూడా పరిరక్షించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోనూ ప్రభుత్వ, అటవీ భూముల పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేసినట్లు సీఎం పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ భూముల వ్యవహారాలపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఈ అంశాలపై శాసనసభలో చర్చించేందుకు బీఆర్ఎస్ నాయకులు ముందుకు రావాలని సవాల్ విసిరారు. మియాపూర్ భూముల విషయంలో ఇకనైనా వివాదాలు సృష్టించకుండా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని కేటీఆర్, హరీశ్‌రావులకు సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ప్రజల కోసమే కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

లేవని, ఆదిలాబాద్ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేపీ రావు, జగన్నాథ ప్రాజెక్టులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. రైతులకు నీరు, విద్యుత్, యూరియా అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పంటలు వేయొద్దని సూచిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలో ఎందుకు కొనసాగాలని ప్రశ్నించారు. తమ పార్టీ పాంచజన్య పేరుతో ఐదు ప్రధాన అంశాలను లక్ష్యంగా పెట్టుకుందని కవిత తెలిపారు. ప్రైవేటు రంగంలోనూ మెరుగైన ఉచిత విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తామని, యువతకు రుణాలు కల్పించి ఆర్థికంగా ఎదిగేలా తోడ్పడతామని హామీ ఇచ్చారు. రైతులకు సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించి వారి గౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమన్నారు. ఆదిలాబాద్‌లో రైతు గర్జన సభ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ముందుగా గతంలో తాము చేసిన పనులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సభకు ముందు ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద కుమురం భీం, కుమురం సూరు, రాంజీ గోండు, వన్నెల ఎల్లన్న, వెడ్మ రాములకు నివాళు లర్పించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపూరావు, మాజీ మంత్రి బోడ జనార్ధన్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతాంగ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల ఏర్పాటు

రూ.2 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్,అక్టోబర్ 30 : వ్యవసాయ రంగానికి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర

సత్యనారాయణరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పలు ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఇతర ప్రాంతాల నుంచి విద్యుత్ తీసుకొస్తున్నామని వివరించారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేయాలని, రబీ పంటల సాగుపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సర్పంచ్ బండి భగవాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు పారదర్శకంగా జరగాలి

తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే చట్టపరమైన చర్యలు

అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్,అక్టోబర్ 30 : పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పట్టభద్రుల ఓటర్ల

నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ఎలా జరుగుతోందో, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఎదుర్కొంటున్న సమస్యలేమిటో అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని, అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖా స్తుదారులు సమర్పించిన ఫారం-18, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటరుగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, అల్వాల్ తహశీల్దార్ రాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ప్రస్తుతం జనగణన నుంచి మినహాయింపు ఇచ్చింది. లడఖ్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లోనూ ఈ షెడ్యూల్ వర్తించదు. జనగణనలో భాగంగా 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకునే అవకాశం కల్పించనున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరిస్తారు. మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలను జనగణన ప్రామాణిక తేదీగా నిర్ణయించారు. మినహాయింపు పొందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు సంబంధించిన తేదీలను తరువాత ప్రకటించనున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం, పక్షపాతం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించాలని పునేఠా స్పష్టం చేశారు. ఎన్నికల ప్రారంభ దశలో ఏడు జిల్లాల నుంచి అందిన ఫిర్యాదులను డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓటర్ల సంఖ్య, భద్రతా ఏర్పాట్లు, కేంద్రం వివరాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున సూచించారు. ఒక్క బ్యాలెట్ పేపర్ కూడా గల్లంతు కాకుండా పటిష్ఠ భద్రత కల్పించాలని, స్ట్రాంగ్‌రూమ్‌లకు సుమారు 100 మీటర్ల దూరంలో ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా ఎవరూ పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. ఓటింగ్ గోప్యతకు భంగం కలగకుండా మీడియా ప్రతినిధులు వ్యవహరించాలని సూచించారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి కదలికను రికార్డు చేయాలని ఐజీ బి.రాజకుమారి ఆదేశించారు. పోలీసు సిబ్బంది సైతం ప్రిసైడింగ్ అధికారి అనుమతితోనే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని, కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో గుంపులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

(మొదటి పేజీ తరువాయి)

తాజా బోనస్‌తో కలిపి ఒకే నెలలో కార్మికులకు అందుతున్న మొత్తం రూ.1,020 కోట్లకు చేరనుంది. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ బోనస్ జాతీయ వేతన ఒప్పందం (ఎన్‌సీడబ్ల్యూఏ) పరిధిలోని కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజులు పనిచేసిన వారు అర్హులు. నిర్ణీత పనిదినాలు పూర్తి చేసిన వారికి పూర్తి బోనస్, అంతకంటే తక్కువ రోజులు పనిచేసిన వారికి పని చేసిన కాలానికి అనుగుణంగా బోనస్ చెల్లించనున్నారు.

ప్రజల జీవితాల్లో మార్పే వాస్తవ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రత కల్పించాలని స్పష్టం చేశారు. డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ సంస్థ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా అమలు చేయడంలో అధికారులకు శిక్షణనిచ్చే సంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలు, పనితీరు మెరుగుపడినప్పుడే ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని అన్నారు. హైదరాబాద్‌లో సాంకేతిక పరిజ్ఞానం, జీవశాస్త్ర పరిశోధనలు, ఆధునిక సేవారంగాలు సాధించిన ప్రగతి రాష్ట్రానికి గొప్ప అవకాశమని భట్టి తెలిపారు. ఈ అభివృద్ధి నగరానికే పరిమితం కాకుండా తయారీ, వ్యవసాయ, గ్రామీణ ఆర్థిక రంగాలకు విస్తరించాలని ఆకాంక్షించారు. యువత ఉపాధి కోసం హైదరాబాద్‌కు మాత్రమే వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత జిల్లాల్లోనే మెరుగైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్సే

(మొదటి పేజీ తరువాయి)

న్యాయపోరాటం చేసిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. 2015లో సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్‌ను నియమించి ప్రభుత్వానికి అనుకూలంగా వాదనలు వినిపించేలా చేశామని పేర్కొన్నారు. 2015 నుంచి 2023 వరకు దాదాపు ఎనిమిదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసును నిరంతరం కొనసాగించిందని హరీశ్‌రావు వివరించారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లు, అఫిడవిట్లు, ఆధారాల సమర్పణలో తమ ప్రభుత్వ పాత్ర కీలకమని చెప్పారు. 2023 జూన్ 15న ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులో వచ్చిన తీర్పు కూడా మియాపూర్ భూముల కేసుకు బలమైన న్యాయపునాది వేసిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని హరీశ్‌రావు విమర్శించారు. గత ప్రభుత్వ కృషికి ప్రస్తుత ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని ఆరోపించారు. సుమారు రూ.60 వేల కోట్ల విలువైన 550 ఎకరాల భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను ఆయన వ్యతిరేకించారు. ప్రజా ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీలకు ఐదేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక

- గ్రామాల వారీగా వివరాల సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు

హైదరాబాద్,అక్టోబర్ 30 : రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఐదేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుత ఏడాదికి ప్రత్యేక కార్యాచరణతో పాటు రానున్న మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాల వారీగా జనాభా, పశువులు, పంటలు, నిరుద్యోగులు, పేద కుటుంబాల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. అందుబాటులో ఉన్న నిధులను సమీకరించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తప్పుడు సమాచారం ఇచ్చినా, వివరాల నమోదు నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం..
100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాల పంపిణీ

- **సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి**
- **వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి**
- **త్వరలో ఏదుల నుంచి డిండి ప్రాజెక్టులోకి నీరు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు**

ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

పోలేపల్లి/చందంపేట భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్యు : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. శుక్రవారం చందంపేట మండలం పోలేపల్లి గ్రామంలోని రైతు వేదికలో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల సాగు, సాగునీటి లభ్యత తదితర అంశాలపై వివరించారు.

100 శాతం సబ్సిడీతో ఉచితంగా వేరుశనగ విత్తనాలు

రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం 700 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 100 శాతం సబ్సిడీతో ఉచితంగా అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సంబంధిత సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో ముందుకు సాగాలని సూచించారు.

సూపర్ ఎల్‌నినో ప్రభావం.. రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఈసారి సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు

అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ సమయంలో వరి పంట సాగుకు దూరంగా ఉండాలని, వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలైన వేరుశనగ తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు సూచించే పంటలను ఎంచుకోవాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పంట నష్టాలను నివారించుకోవాలని తెలిపారు.

90 బోర్లు ఎండిపోయాయి.. నీటిని పొదుపుగా వాడుకోవాలి

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నియోజకవర్గంలో తాగునీటిని అందించే బోర్లు సైతం ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు 90 బోర్లు ఎండిపోయాయని, వాటిలో అత్యధికంగా ఉమ్మడి చందంపేట మండల పరిధిలోనే ఉన్నాయని తెలిపారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకొని పంటల సాగు చేపట్టాలని, వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసి ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

డిండి ప్రాజెక్టుకు ఏదుల నుంచి నీరు తీసుకొచ్చేందుకు కృషి

దేవరకొండ ప్రాంత రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో ఏదుల నుంచి డిండి ప్రాజెక్టులోకి నీటిని తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, తద్వారా ఈ ప్రాంత వ్యవసాయానికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు.

రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సబ్సిడీపై విత్తనాల పంపిణీ, పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రకృతి పరిస్థితులను అర్థం చేసుకొని వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో పాటు దొండేటి మల్లారెడ్డి, ఏడుపుల గోవింద్ యాదవ్, మేకల రాజేందర్ రెడ్డి, కిన్నెర హరికృష్ణ, వాంకునావత్ పాపా నాయక్, కేతావత్ భరత్, జక్కుల మున్నయ్య యాదవ్, కొప్పుల సురేందర్ రెడ్డి, మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామపంచాయతీలో రోజుకు 50 మంది కూలీలకు ఉపాధి కల్పించాలి

- **సాగునీటి కాలువల్లో పూడిక, జమ్ము తొలగింపునకు ప్రాధాన్యత**

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ ద్వారా ప్రతిరోజూ కనీసం 50 మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్న ఓబులేసుతో కలిసి ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, ఈసీలు, ఏపీఎంలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనుల ఎంపిక, పనుల పురోగతి, కూలీలకు ఉపాధి కల్పన, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై మండలాల వారీగా సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని 460 గ్రామపంచాయతీల్లో ప్రతి గ్రామపంచాయతీకి రోజుకు 50 మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి పనులు కల్పించేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కూలీలకు పని కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, గ్రామాల వారీగా కూలీల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

జిల్లాలోని మైనర్, మేజర్ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన కాలువల్లో పేరుకుపోయిన మట్టి, పూడికతో పాటు జమ్ము, ఇతర పిచ్చి మొక్కలను తొలగించే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కాలువలు శుభ్రంగా ఉంటే సాగునీరు సక్రమంగా ప్రవహించి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలకు సంబంధించిన పనులతో పాటు గ్రామీణ ప్రజలకు నేరుగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను కూడా గుర్తించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా పొలాలకు వెళ్లే రహదారులను మరమ్మతులు చేసి రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని తెలిపారు. వ్యవసాయ పనులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అర్హత కలిగిన రైతుల పొలాల్లో ఫామ్ పాండ్స్ (వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు) ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఫామ్ పాండ్స్ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు అవసరమైన సమయంలో పంటలకు నీటిని అందించుకునే అవకాశం ఉంటుందని, పశువుల అవసరాలకు కూడా నీరు ఉపయోగపడుతుందని వివరించారు. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించడంతో పాటు రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఉపాధి హామీ పనుల ఎంపికలో కేవలం కూలీలకు పని కల్పించడమే కాకుండా, ఆ పనుల ద్వారా గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరేలా చూడాలని, ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న వనరులు, వ్యవసాయ అవసరాలు, నీటి వనరులు, రహదారుల పరిస్థితులను పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పనుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల వారీగా పనుల గుర్తింపు, కూలీల సమీకరణ, పనుల ప్రారంభం, అమలు తీరును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ కూలీలకు ఉపాధి కల్పించే బాధ్యత అధికారులపై ఉందని, ఈ విషయంలో సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, నీటి వనరులను సంరక్షించడం, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

పెట్టుబడులకు, ప్రజల జీవన ప్రమాణాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- **యువతకు నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు.. జిల్లాల విద్యార్థులకూ ఐటీ రంగంలో ప్రాధాన్యం**
- **⑩ఇన్ఫోసిస్ విస్తరణతో హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థల విశ్వాసం మరింత బలోపేతం**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30: పెట్టుబడులకు అనుకూలమైన నగరంగానే కాకుండా, ప్రజలు మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించేందుకు అనువైన ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మెరుగైన మౌలిక సదుపాయాలు, వేగవంతమైన పరిపాలన, నిరంతర విద్యుత్ సరఫరా, పర్యావరణహిత అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని పోచారం ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో విస్తరణలో భాగంగా నిర్మించిన నూతన కార్యాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ ప్రతినిధులు వారికి ఘన స్వాగతం పలికారు. సంస్థ ప్రస్థానం, అంతర్జాతీయ కార్యకలాపాలు, పోచారం క్యాంపస్ ప్రత్యేకతలు, నూతన భవన విస్తరణ, ఆధునిక సదుపాయాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఉప ముఖ్యమంత్రి, మంత్రికి వివరించారు. అనంతరం వారు నూతన కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇన్ఫోసిస్ సంస్థ హైదరాబాద్‌లో మరోసారి పెట్టుబడులు పెట్టడం నగరంపై ఆ సంస్థకున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 48 వేల మందికి పైగా ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇన్ఫోసిస్, పది లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్ర ఐటీ రంగ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఐటీ రంగం వేలాది కుటుంబాల జీవితాల్లో ఆర్థిక, సామాజిక మార్పులకు కారణమైందని, యువతకు ఉపాధితోపాటు కుటుంబాల అభ్యున్నతికి బాటలు వేసిందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ)తో సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడుతున్న నేపథ్యంలో యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం, ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాన్ని పెంచాలని, ముఖ్యంగా జిల్లాల కళాశాలల విద్యార్థులకు ఐటీ రంగంలో సమాన అవకాశాలు కల్పించాలని ఇన్ఫోసిస్‌ను కోరారు.

తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు

- **కర్టెన్ రైజర్ లో చర్చ గ్లోబల్ సమ్మిట్ కు రంగం సిద్ధం**
- **ఢిల్లీలో తెలంగాణ ప్రతినిధుల సమాలోచన**
- **తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమ్మిట్**
- **ఢిల్లీ రమేష్ పాల్గొన్న కర్టెన్ రైజర్**

ఢిల్లీ/నల్గొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్యు: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 కు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి అంశాలపై ఎంపీలు, మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కలిసి చర్చించారు. రాష్ట్రాన్ని దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ కర్టెన్ రైజర్ కార్యక్రమం సమ్మిట్ కు ప్రాథమిక వేదికగా నిలిచింది.

ఉచిత కంటి శిబిరంలో 55 మందికి కంటి పరీక్షలు....

- **20 మందికి కంటి ఆపరేషన్లు....**

జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి...

నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం102 గది లో నిర్వహించిన కంటి చికిత్స శిబిరం విజయవంతమైనట్లు జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో అర్హులైన క్యాటరాక్ట్ పొరగల 20 మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్‌లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు. రోగులకు శిబిరంలో ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు,మందులు అందజేశారు. ప్రతి ఒక్కరు జీవితకాలము కంటిచూపును కలిగి ఉండుటకు ప్రతి రోజు నిత్య భోజనంలో విటమిన్- ఏ,కూడిన క్యారెట్,ఆకుకూరలు,చేపలు, ఆహార పదార్థాలు అధిక మొత్తంలో తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ, పోతుల సుకుమా రెడ్డి, హెల్త్ ఎద్యుకేటర్ ఓరుగంటి. శ్రీనివాస్, బాదం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం విజయవంతం

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30 : హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు, నాంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ సిహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ అబ్దుల్లా సోయెల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడం, అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించడం, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికల కార్యాచరణను క్షేత్రస్థాయిలో అమలు చేయడంపై చర్చించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

డోస్ స్పెషాలిటీ కాఫీ షాపు ప్రారంభం

- **ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మన్నె గోవర్ధన్‌రెడ్డి**

హైదరాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డోస్ స్పెషాలిటీ కాఫీ (DOSE Speciality Coffee) షాపును మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుతో కలిసి ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి (ఎంజీఆర్) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, విప్లవ్‌కుమార్, రామచందర్, నరసింహ ముదిరాజ్, రావుల విజయ్‌మూర్తుజ్, యూసుఫ్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో గ్రాడ్యుయేట్ ఓటు నమోదు స్టాల్ ప్రారంభం

- అంబేద్కర్ చౌరస్తాలో పట్టభద్రుల ఓటు అవగాహన
- ప్రతి గ్రాడ్యుయేట్ నమోదు కావాలి ఓటు హక్కు భవిష్యత్తును నిర్ణయించే శక్తి
- విద్యావంతుల పాత్రతోనే సమాజంలో మార్పు
- కొండమల్లేపల్లిలో BRS అవగాహన కార్యక్రమం

రామావత్ రమేష్ నాయక్ పిలుపు

కొండమల్లేపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు అవగాహన నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన BRS పార్టీ నాయకులు రామావత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలని కలలు కన్నారని, ఆ రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప హక్కుల్లో ఓటు హక్కు ఒకటని అన్నారు. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు, మన భవిష్యత్తును నిర్ణయించే శక్తి అని అన్నారు. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుల పాత్ర చాలా కీలకమని, సమాజంలో మార్పు రావాలంటే విద్యావంతులు రాజకీయ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2023 డిసెంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటును నమోదు చేసుకోవాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామాల్లోని విద్యావంతులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని కోరారు. ఒక ఓటు మన గొంతుకను వినిపిస్తుందని, మన సమస్యలను చట్టసభ వరకు తీసుకెళ్లే శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. నిరుద్యోగ యువత, ఉద్యోగుల సమస్యలు, విద్యావ్యవస్థలో మార్పుల కోసం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ సీనియర్ నాయకులు పెద్దిశెట్టి సత్యం, చింతకుంట్ల సర్పంచ్ కావటి వెంకటేష్, దాచేపల్లి నరేందర్, శేఖర్ యాదవ్, బోడ యాదగిరి, రజినికాంత్, మూడవత్ పాండు నాయక్, నేనావత్ శంకర్ నాయక్, కోర్ర భీమా నాయక్, రావుల సత్యనారాయణ, రామాంజనేయ చారి, లక్ష్మణ్ నాయక్, గౌస్ పాషా, యాదయ్య, శ్రీను, శంకర్, ఆజీజ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ గిరిజన బాలికల (COE) గురుకులంలో వరుస ఘటనలు

- తల్లిదండ్రుల్లో ఆందోళన 24 గంటల్లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం
- దేవరకొండ గురుకులంలో ఏం జరుగుతోంది?
- దేవరకొండ గురుకులం అగమ్యగోచరం
- విద్యార్థినుల భద్రతపై ప్రశ్నలు ఇంటి నుండి క్షేమంగా వచ్చిన విద్యార్థినికి హాస్టల్‌లో ఏమైంది?
- విద్యార్థి సంఘాల ఆగ్రహం

నల్లగొండ/భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి: దేవరకొండ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నడుస్తున్న గిరిజన బాలికల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (COE) గురుకులంలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. విద్యార్థినుల తల్లిదండ్రుల గుండెల్లో గుబులు మొదలైంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన గురుకులాలు ప్రస్తుతం అగమ్యగోచరంగా మారాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవరకొండ గిరిజన బాలికల COE గురుకులంలో నిన్న

రాత్రి MPC మొదటి సంవత్సరం విద్యార్థిని, ఈరోజు ఉదయం BiPC మొదటి సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఇంటి నుండి క్షేమంగా హాస్టల్ కి వచ్చిన విద్యార్థినికి రాగానే ఏమైంది? ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు ఏమిటి? అనేది ప్రస్తుతం అందరి ముందున్న పెద్ద ప్రశ్నగా మారింది.

ప్రభుత్వం వసతులు కల్పిస్తుంటే... పర్యవేక్షణ లోపమా?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు, నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యను అందించడంలో ఎక్కడా రాజీ పడకుండా ఖర్చుకు వెనకాడడం లేదు. విద్యార్థుల యోగక్షేమాలను అనునిత్యం పర్యవేక్షిస్తూ వారి శారీరక, మానసిక ఎదుగుదల కోసం కృషి చేస్తోంది. అయితే ఇలాంటి తరుణంలో వాటిని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించే ఉపాధ్యాయులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రెండు నెలల క్రితం మిస్సింగ్... ఇప్పుడు వరుస ఘటనలు:

రెండు నెలల క్రితం ఇదే గురుకులంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని మిస్సింగ్ అయిన ఘటన మరువకముందే... ఇప్పుడు 24 గంటల వ్యవధిలో ఇద్దరు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దీని వెనుక మానసిక ఒత్తిడి ఉందా? తోటి విద్యార్థినులు, సిబ్బంది వేధింపులు ఉన్నాయా? లేక వసతుల కొరత, ఇతర సమస్యలే కారణమా? అనేది తేలాల్సి ఉంది.

విద్యార్థి సంఘాల ఆగ్రహం:

ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు వెంకటేష్, VVR తీవ్రంగా స్పందించారు. గిరిజన బాలికల COE గురుకులంలో విద్యార్థినులు క్షేమంగా లేరనడానికి ఈ ఘటనలే నిదర్శనమని, సంబంధిత ఉపాధ్యాయుల తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చావు వరకు వెళ్తున్నారంటే విద్యార్థినులు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆ గురుకులాన్ని సందర్శించి, విద్యార్థినులకు తగిన భరోసా కల్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ రాజ్యం

- డిండి మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత
- పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం

ఎమ్మెల్యే బాలు నాయక్

డిండి, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, నిరుపేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తూ గ్రామాల రూపురేఖలు మారుస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం డిండి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

డిండి మండలం పెద్ద తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించి, ఓపెన్ ఎయిర్ జిమ్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చెర్కుపల్లి గేటు వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. గ్రామంలోని రైతు వేదిక సమీపంలో యువత, గ్రామ ప్రజల ఆరోగ్యం, శారీరక దృఢత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. గతంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన రహదారులు, తాగునీరు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమాల్లో సంబంధిత ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు దొంతినేని వెంకటేశ్వరరావు, ముత్యాల శశిధర్ రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, చింతలపూడి భాస్కర్ రెడ్డి, తూమ్ నాగార్జున రెడ్డి, కాట్రావత్ చిట్టి శంకర్, మీసాల రామచంద్రయ్య, మండల సర్పంచులు, గడ్డమీది సాయి కుమార్, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

20 ఏళ్ల యువతికి బ్రెయిన్ స్ట్రోక్

యశోదా వైద్యుల అధునాతన చికిత్సతో ప్రాణగండం నుండి బయట 5 మి.మీ మిడ్ లైన్ షిఫ్ట్ తో సంక్లిష్ట పరిస్థితి

- నల్గొండ యువతికి మలక్ పేట్ యశోదాలో సక్సెస్ ఫుల్ ట్రీట్మెంట్
- కుడి చేయి, కాలు కదలక... మాట కోల్పోయిన యువతికి పునర్జన్మ ప్రసాదించిన యశోదా వైద్యులు చిన్న వయసులో బ్రెయిన్ స్ట్రోక్
- మల్టీ డిసిప్లినరీ టీమ్‌తో ప్రాణాలు కాపాడిన యశోదా సూపర్ స్పెషాలిటీ

నల్గొండ / భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి: హైదరాబాద్, అకస్మాత్తుగా మాట కోల్పోవడం, కుడి చేయి, కుడి కాలు కదలకపోవడం వంటి తీవ్ర లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన 20 ఏళ్ల యువతికి హైదరాబాద్ మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అధునాతన చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. బ్రెయిన్ స్కానింగ్‌లో ఎడమ యాంటీరియర్ సెరిబ్రల్ ఆర్టరీ (ACA) పరిధిలో అక్యూట్ ఇస్కీమిక్ స్ట్రోక్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఎడమ పారాసాజిటల్ ఫ్రంటోపారియటల్ ప్రాంతంలో ఇన్ ఫార్క్ట్ ఏర్పడి, మాస్ ఎఫెక్ట్ కారణంగా మెదడు మధ్యరేఖ కుడివైపునకు 5 మిల్లీమీటర్లు మారినట్లు గుర్తించారు. ప్రారంభ పరీక్షల్లో యువతి కుడి చేయి, కుడి కాలు కండరాల శక్తి 0/5 గా నమోదైంది, అఫేసియా కూడా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే న్యూరో ICUలో నిరంతర పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. న్యూరోసర్జన్ పరీక్షల అనంతరం బ్రెయిన్ సర్జరీ అవసరం లేకుండా కన్జర్వేటివ్ మెడికల్ మేనేజ్ మెంట్ కొనసాగించారు. అదే సమయంలో రక్తంలో పొటాషియం స్థాయి లీటరుకు 1.8 మిల్లీమోల్స్‌కు పడిపోవడం, నియంత్రణకు కష్టమైన అధిక రక్తపోటు, సోడియం స్థాయిల్లో హెచ్చుతగ్గులు కనిపించడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. దీంతో న్యూరాలజీ, క్రిటికల్ కేర్, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ సహా వివిధ విభాగాల నిపుణులు సమన్వయంతో చికిత్స అందించారు. హార్మోన్ల సంబంధిత సమస్య ఉండవచ్చనే అనుమానంతో ప్రత్యేక పరీక్షలు నిర్వహించినప్పటికీ కంజెనిటల్ అడ్రినల్ హైపర్ ప్లాసియా, 17-ఆల్ఫా హైడ్రాక్సిలేస్ డెఫిషియెన్సీ నిర్ధారణ కాలేదు. చిన్న వయసులో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు ఇతర అంతర్లీన ఆరోగ్య సమస్యలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని, ఈ యువతికి తీవ్రమైన స్ట్రోక్ తో పాటు రక్తపోటు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ఉండటంతో నిపుణుల సమన్వయంతో చికిత్స అందించినట్లు కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డా. సూరిశెట్టి భరత్ కుమార్ తెలిపారు. ఇటువంటి క్లిష్టతరమైన కేసుల్లో అనుమానిత హార్మోన్ల సమస్యపై మరిన్ని పరీక్షలు అవసరమని కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ డా. జయాదిత్య ఘోష్, బ్రెయిన్ స్కానింగ్ ఫలితాలను పరిశీలించి కన్జర్వేటివ్ మేనేజ్ మెంట్ సూచించినట్లు సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా.బి. గేయానంద్ సుధీర్ తెలిపారు. చికిత్స అనంతరం యువతి ఆరోగ్య పరిస్థితిలో సంతృప్తికర మెరుగుదల కనిపించడంతో హీమోడైనమికల్‌గా స్థిరమైన పరిస్థితిలో డిశ్చార్జి చేశారు. వివిధ విభాగాల సమన్వయంతో సంక్లిష్ట కేసులకు సమగ్ర చికిత్స అందిస్తున్నట్లు యశోదా ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ శ్రీనివాస్ చిదుర తెలిపారు. అకస్మాత్తుగా శరీరంలో ఒకవైపు బలహీనత, మాట రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వయసుతో సంబంధం లేకుండా వెంటనే అత్యవసర వైద్య సేవలు పొందాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్రంలోని క్రైస్తవ సమాజానికి రాజకీయ భాగస్వామ్యం

శాసనసభ శాసనమండలి స్థానిక సంస్థల్లో సంస్థ ప్రాధాన్యం కల్పించాలని ఫాదర్ క్యాథలిక్ బిషప్ రాజు అలెక్స కోరారు

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30: సోమజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ రంగాల్లో అవకాశ కల్పన కోసం సమర్పిస్తున్న విజ్ఞాపత్రం తెలంగాణ క్రైస్తవ పాస్టర్లు నాయకులు క్రైస్తవ పెద్దలు విజ్ఞప్తి చేశారు కాంగ్రెస్ పార్టీకి క్రైస్తవ సమాజం చారిత్రాత్మక అనుబంధంతో పాటు సమాజానికి అందించిన సేవలు అమోఘమైన మని ఆయన అన్నారు ఐదు దశాబ్దాల ఎన్నికల రాజకీయ అనుబంధం ఉందని అవి భక్త ఆంధ్రప్రదేశ్ లో భాగంగా ఉన్న కాలం నాట్ నుంచి నేటి తెలంగాణ వరకు ఐదు దశాబ్దాలు పైగా క్రైస్తవ సమాజం లౌకికవాదం సమగ్రత సామాజిక న్యాయం వంటి సూత్రాలకు ప్రాధాన్యతను ఇచ్చే భారత జాతీయ కాంగ్రెస్ పార్టీతో రాజకీయంగా అనుబంధాన్ని కొనసాగిస్తూ తమ మద్దతు ఇచ్చిందని ఆయన చెప్పారు 20 23 కాంగ్రెస్ పార్టీలో అధికారం రావడం కోసం క్రైస్తవ సంఘాలు కృషిచేశారని ఆయన తెలిపారు సామాజిక మౌలిక సదుపాయాలు దేశ నిర్మాణంలో భాగస్వామ్యం విద్యా క్రైస్తవ మిషనరీ సంస్థలు తెలంగాణ వ్యాప్తంగా అనేక పాఠశాలలు డిగ్రీ కళాశాలలో వృత్తిపరమైన విద్యా సంస్థలు సాంకేతిక శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నాయని మిషన్ ఆసుపత్రులు గ్రామీణ వైద్య కేంద్రాలు ప్రజారోగ్య కార్యక్రమాల ద్వారా సేవలందిస్తూ కులమతం అనే భేదం లేకుండా లక్షలాదిమంది విద్యార్థులను నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని ఆయన తెలిపారు ప్రతి జిల్లాలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా క్రైస్తవ ముస్లింలు సమన్వయ కార్యక్రమాలు భాగస్వాములు అయి సేవలందిస్తున్నారని ఆయన వివరించారు సికింద్రాబాద్ మల్కాజిగిరి మేడ్చల్ మల్కాజిగిరి రంగారెడ్డి జిల్లాలో పేదలకు వైద్య సేవలు అందిస్తుందని తెలంగాణ నిజాంబాద్ మెదక్ కామారెడ్డి ఖమ్మం వరంగల్ జిల్లాలో దక్షిణ తెలంగాణ ఇతర ప్రాంతాలైన నల్గొండ మహబూబ్నగర్ కరీంనగర్ తెలంగాణలో 119 నియోజకవర్గాల్లో క్రైస్త సమాజం విశేషమైన ప్రాధాన్యత ఉందని కొన్ని అంచనాల ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 25 నుండి 30 శాసనసభ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు ప్రభావితం చేసే శక్తి క్రైస్తవ ఓట్లకు ఉందని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో జాతీయ ప్రెసిడెంట్ సి.ఆర్.ఐ.ఎల్ డాక్టర్ కే బాబురావు ఐపీఎస్ రిటైర్డ్ ఐపీఎస్, ప్రొఫెసర్ డాక్టర్ రెవరెండ్ రాజేశ్వర్ సలమోన్ రెవిడెన్స్ సంజయ్ కుమార్ తెలంగాణ బాప్టిస్ గుడ్ షెఫర్డ్ చర్చ్ గిరిబాబు యూత్ ప్రెసిడెంట్ మెటల్ రాజ్ బీమ్ రాముడు నాయుడు బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ బిషప్ బుక్ నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కాంగ్రెస్ వైఫల్యాలు, ప్రజా సమస్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

- అమిత్ షా నిరసన పాదయాత్రను విజయవంతం చేయాలి
- బీజేపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పిలుపు

ఉప్పల్,అక్టోబర్ 30(భవిష్యత్ ప్రజాపాలన): నవంబర్ 2వ తేదీన రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం – అరాచకత్వాన్ని అంతం చేద్దాం" (లోకతంత్ర బచావో– అరాచకత హటావో) నిరసన పాదయాత్రను విజయవంతం చేయాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్న నేపథ్యంలో, పాదయాత్ర విజయవంతానికి రామంతాపూర్ డివిజన్‌లో బీజేపీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు క్షేత్రస్థాయిలో అమలుకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో చోటుచేసుకుంటున్న అరాచక ధోరణులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, నిరుద్యోగుల సమస్యలు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో ప్రజల ముందుంచి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ చేస్తున్న పోరాటాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో, రామంతాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వంగాల సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నవంబర్ 2న జరిగే నిరసన పాదయాత్రకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. అమిత్ షా పాల్గొననున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాదయాత్ర విజయవంతానికి రామంతాపూర్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలను చైతన్యపరిచేలా కార్యాచరణ చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంతో స్థానిక బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

చిన్నారి ప్రథమ పుట్టినరోజు వేడుకలో చిన్నారిని ఆశీర్వదించిన

మాజీ మున్సిపల్ చైర్మన్ తీదేడు గ్రామ చిన్నారి పుట్టినరోజులో సందడి చేసిన దేవేందర్ నాయక్

కొండమల్లేపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య : కొండమల్లేపల్లిలోని సాగర్ రోడ్డులో ఉన్న VDN ఏసీ కన్వెన్షన్ హాల్‌లో తీదేడు గ్రామానికి చెందిన మద్రు శ్రీనివాసరావు మనుమరాలి ప్రథమ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్ హాజరై చిన్నారిని ఆశీర్వదించి, హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్నశేఖర్ రెడ్డి, మద్రు శ్రీనివాసరావు, రమేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓనమాలు దిద్దిన బడికి.. ఉన్నత హోదాలో ఆత్మీయ రాక!



- **చిన్ననాటి చదువుల బడిని సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగ మౌలిక సదుపాయాల ఎండీ ఇందుర్తి గణపతిరెడ్డి**
- **తరగతి గదుల్లో బాల్యపు మధుర జ్ఞాపకాల నెమరువేత.. ఘనంగా స్వాగతం పలికి సన్మానించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు**

మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన : జీవితంలో ఎన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించినా.. తొలి అక్షరం నేర్పిన బడిని, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎవరూ మరువలేరు. బాల్యంలో ఓనమాలు దిద్దిన తరగతి గదులు, స్నేహితులతో గడిపిన క్షణాలు, గురువుల బోధనలు జీవితాంతం మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అలాంటి అనుబంధానికి డిండి చింతపల్లి ప్రాథమిక పాఠశాల వేదికైంది. ఒకప్పుడు ఇదే పాఠశాలలో విద్యార్థిగా అక్షరాలు నేర్చుకున్న వ్యక్తి.. నేడు రాష్ట్రస్థాయి ఉన్నత బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారిగా తిరిగి అదే బడికి రావడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మాజీ ఆర్అండ్బీ ఇంజినీరింగ్ ఇన్చీఫ్, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగ మౌలిక సదుపాయాల మేనేజింగ్ డైరెక్టర్గా బాధ్యతలు నిర్వహిస్తున్న డిండి చింతపల్లి ముద్దుబిడ్డ ఇందుర్తి గణపతిరెడ్డి శుక్రవారం ఉదయం 11 గంటలకు తాను బాల్యంలో చదువుకున్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రాయిచెడ్ చెన్నారంలోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు వెళ్తున్న మార్గమధ్యంలో తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకునేందుకు పాత పాఠశాలకు విచ్చేశారు.

బాల్యపు జ్ఞాపకాలతో పులకించిన మనసు

పాఠశాలకు చేరుకున్న గణపతిరెడ్డికి ప్రధానోపాధ్యాయుడు ఏ. చిన్నయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల బృందం, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన ఆయన తన చిన్ననాటి విద్యాభ్యాస రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు విద్యార్థిగా కూర్చున్న తరగతి గదులను తిరిగి చూస్తూ బాల్యపు మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఏ. చిన్నయ్య పాఠశాలలో ప్రస్తుతం ఉన్న తరగతి గదుల పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన వివరాలను తెలియజేశారు.

ఘనంగా సన్మానం.. ఆత్మీయ అభినందనలు

తమ పాఠశాలలో చదువుకుని రాష్ట్రస్థాయిలో ఉన్నత బాధ్యతలు చేపట్టిన గణపతిరెడ్డిని పాఠశాల తరఫున శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సొంతూరి బడితో ఆయనకు ఉన్న అనుబంధం, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పాఠశాలను సందర్శించడం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఉన్నత స్థానాలకు ఎదిగినా తన మూలాలను మరువకుండా పాఠశాలకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

స్వాగత కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి. రాంభీష్మ, ఉపసర్పంచ్ సత్యం, సివిల్ కాంట్రాక్టర్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సాయిలు, భోజనశాల నిర్మాణ దాత తుమ్మల రామచంద్రారెడ్డి, వార్డు సభ్యులు శ్రీశైలం, స్వప్న మల్లేష్, కాంపల్లి విష్ణు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు కాంపల్లి సాయిలు, కృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి, బాలస్వామి, కాశీనాథం, ఆంజనేయులు, కృష్ణయ్య, పర్వతాలు, జానీఫాష, వాసు, కర్నాకర్ తదితరులు హాజరై గణపతిరెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికారు.

ఉపాధ్యాయుల సమక్షంలో ఆత్మీయ వేడుక

పాఠశాల ఉపాధ్యాయులు బి. నాగభూషణం, ఎస్. రాజేశ్వర్ గౌడ్, వై. శివ, పి. అరుణ, కె. సంధ్య, మాధవి, అనూషతోపాటు గ్రామ పంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తుల సమక్షంలో సందడి వాతావరణం నెలకొంది.

భావితరాలకు బాటలు చూపిన స్ఫూర్తి

గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుని ఉన్నతస్థాయి బాధ్యతలు చేపట్టిన ఇందుర్తి గణపతిరెడ్డి ప్రస్థానం నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం. పట్టుదల, క్రమశిక్షణ, విద్య పట్ల నిబద్ధత ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చనే సందేశాన్ని ఆయన పర్యటన చాటిచెప్పింది. మనిషి ఎదుగుదలకు తొలి మెట్టు పాఠశాల.. ఆ ఎదుగుదలకు దిశానిర్దేశం చేసే వారు గురువులు. ఎన్ని ఉన్నత స్థానాలకు చేరుకున్నా మన మూలాలను మరువకపోవడమే నిజమైన వ్యక్తిత్వానికి నిదర్శనం" అనే సందేశాన్ని ఇందుర్తి గణపతిరెడ్డి తన పాఠశాల సందర్శనతో చాటిచెప్పారు. ఈ ఆత్మీయ కలయిక డిండి చింతపల్లి గ్రామ ప్రజలకు, విద్యార్థులకు మధుర జ్ఞాపకంగా నిలిచింది.

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీలేని పోరాటం

- **కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు.. సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి వరుస విజయాలు**
- **రెవెన్యూ యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు**
- **రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30: ప్రభుత్వ భూముల పరిరక్షణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాజీలేని వైఖరితో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఒకవైపు కఠిన చర్యలు తీసుకుంటూనే, మరోవైపు దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో పెండింగ్లో ఉన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు సమర్థవంతమైన న్యాయపోరాటం చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ భూముల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విలువైన ప్రభుత్వ భూములపై కొనసాగుతున్న న్యాయవివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రెవెన్యూ అధికారులు, న్యాయశాఖ, ప్రభుత్వ న్యాయవాదుల మధ్య సమన్వయాన్ని పెంచి, సుప్రీంకోర్టు సహా వివిధ న్యాయస్థానాల్లో ప్రభుత్వ వాదనలను బలంగా వినిపించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారని వివరించారు. గతంలో సరైన పర్యవేక్షణ, సమన్వయం కొరవడటంతో అనేక విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించి దశాబ్దాల తరబడి న్యాయవివాదాలు కొనసాగాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన పాత రికార్డులు, రెవెన్యూ ఆధారాలు, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ హక్కులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ క్రమంలో కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల విలువైన భూమికి సంబంధించి సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడం ప్రభుత్వ భూముల పరిరక్షణలో కీలక విజయమని మంత్రి గుర్తుచేశారు. తాజాగా మియాపూర్ భూములకు సంబంధించి కూడా సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడం ప్రజా ప్రభుత్వం చేపట్టిన న్యాయపోరాటానికి మరో బలమైన నిదర్శనమన్నారు. ఈ రెండు ఉదంతాలు ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవను, రెవెన్యూ శాఖ సమర్థవంతమైన కార్యాచరణను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వివాదాల్లో చిక్కుకున్న అత్యంత విలువైన భూములను న్యాయపోరాటం ద్వారా ప్రభుత్వానికి చెందేలా అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడం సాధారణ విషయం కాదని, దీని వెనుక ప్రభుత్వ చిత్తశుద్ధి, అధికారుల సమన్వయం, న్యాయపరమైన కృషి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం న్యాయస్థానాల్లో సమర్థవంతంగా ప్రభుత్వ వాదనలు వినిపించి ఆ భూములు ప్రభుత్వానికి దక్కడంలో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులు, ప్రభుత్వ న్యాయవాదులను మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ భూమి అంటే అది ఏ ఒక్క వ్యక్తికో, సంస్థకో చెందిన ఆస్తి కాదని, అది రాష్ట్ర ప్రజలందరి ఉమ్మడి ఆస్తి అని మంత్రి స్పష్టం చేశారు. నేటి తరంతో పాటు భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆక్రమణలకు పాల్పడినా, అక్రమంగా హక్కులు పొందేందుకు ప్రయత్నించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడటం అంటే ప్రజల సంపదను కాపాడటమే. ఆక్రమణలను అడ్డుకోవడం మాత్రమే కాకుండా,న్యాయస్థానాల్లోనూ ప్రభుత్వ హక్కులను సమర్థవంతంగా నిలబెట్టడమే మా ప్రభుత్వ లక్ష్యం. కంచె గచ్చిబౌలి, మియాపూర్ భూముల విషయంలో సాధించిన విజయాలు ఈ దిశగా మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనాలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు మరింత పటిష్టమైన చర్యలు కొనసాగిస్తాం. ప్రజల ఆస్తులను కాపాడే విషయంలో ఎలాంటి రాజీ ఉండదు అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్పై వరుణుడి బీభత్సం.. దంచికొట్టిన వాన!

- **క్షణాల్లో తడిసి ముద్దయిన మహానగరం.. నెల రోజుల విరామం తర్వాత ఒక్కసారిగా విరుచుకుపడిన వర్షం..**
- **తూర్పు నుంచి పశ్చిమం వరకు భారీ వర్షపు జల్లులు.. ఎండలు, ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం**

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన: హైదరాబాద్ మహానగరాన్ని వరుణుడు ఒక్కసారిగా పలకరించాడు. అప్పటివరకు ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన నగరంపై కుండపోతగా వర్షం కురిసింది. ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకోవడంతో మొదలైన వాన.. చూస్తుండగానే జోరందుకుంది. కేవలం కొద్దిసేపట్లోనే నగరంలోని రహదారులు, వీధులు వర్షపు నీటితో తడిసిముద్దయ్యాయి. నెల రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న నగరవాసులకు వరుణుడి రాక కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో నగరమంతా చల్లబడింది. ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది.

తూర్పు నుంచి పశ్చిమం వరకు దంచికొట్టిన వాన

నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం తన ప్రతాపాన్ని చూపించింది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని నాంపల్లి, యాకుత్పురా, చార్మినార్, మలక్పేట, ఎల్బీనగర్, సంతోష్నగర్, సైదాబాద్, మాదన్నపేట, మీరాలం మండి ప్రాంతాల్లో వర్షం కురిసింది. మరోవైపు కాప్రా, ఘట్కేసర్, బోడుప్పల్, మేడిపల్లి, చర్లపల్లి ప్రాంతాల్లోనూ భారీ వర్షం దంచికొట్టింది. నానక్రామ్గూడ, మణికొండ, టోలిచౌకి, షేక్పేట్ తదితర ప్రాంతాల్లో సైతం వాన జోరందుకుంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఒకేసారి వర్షం కురవడంతో రహదారులన్నీ తడిసి ముద్దయ్యాయి. ఎక్కడ చూసినా వర్షపు జల్లులు, చల్లని గాలులతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

క్షణాల్లో మారిన వాతావరణం.. తడిసి ముద్దయిన రహదారులు

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడిన ప్రజలకు ఒక్కసారిగా కురిసిన వర్షం ఆశ్చర్యాన్ని కలిగించింది. కొద్దిసేపటి క్రితం వరకు ఎండతో మండిపోయిన రహదారులు వర్షపు నీటితో తడిసిపోయాయి. ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీయడంతో నగర వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలుచోట్ల వాహనదారులు వర్షం నుంచి రక్షణ కోసం షెల్టర్లు, దుకాణాల వద్ద ఆశ్రయం పొందారు. మరికొందరు వర్షంలో తడుస్తూనే తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. చాలా రోజుల తర్వాత కురిసిన వానతో నగరవాసుల్లో ఆనందం కనిపించింది.

ఉక్కపోతకు చెక్.. చిన్నారులు, యువతలో ఉత్సాహం

గత కొన్ని రోజులుగా భానుడి భగభగలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులకు వరుణుడి పలకరింపు ఉపశమనాన్ని ఇచ్చింది. వర్షం కురవడంతో ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గి చల్లని వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువత వర్షాన్ని ఆస్వాదిస్తూ సందడి చేశారు. వాన చినుకులతో నగర వీధులు కొత్త అందాన్ని సంతరించుకున్నాయి. ఎండలతో అల్లాడిన ప్రజలు వర్షం రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. వర్షం మరికొంతసేపు కొనసాగితే వాతావరణం మరింత చల్లబడుతుందని నగరవాసులు ఆశిస్తున్నారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షం నేపథ్యంలో నగర రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, రహదారులపై గుంతలు, జారుడుగా మారిన మార్గాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వేగాన్ని తగ్గించి వాహనాలు నడపాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు వర్షపు పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి.

వరుణుడి పలకరింపుతో నగరానికి కొత్త కళ!

నెల రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న హైదరాబాద్ నగరాన్ని వరుణుడు ఒక్కసారిగా తన జలధారలతో తడిపేశాడు. కొద్దిసేపట్లోనే నగర రూపురేఖలు మారిపోయేలా వర్షం కురవడంతో ప్రజలకు ఎండల బాధ నుంచి తాత్కాలిక ఉపశమనం లభించింది. వర్షపు చినుకులతో చల్లబడిన నగరం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సంతరించుకుంది. అయితే వర్షం మరింత విస్తరించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మత్స్య సంపద, విపత్తుల నిర్వహణపై అవగాహన పొందిన విద్యార్థులు

- **ఫీల్డ్ ట్రిప్లో అవగాహన పొందిన ఫిషరీస్ మరియు లైఫ్ సైన్స్ విద్యార్థులు**

నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ఫిషరీస్, లైఫ్ సైన్సెస్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్లో భాగంగా కేసరి సముద్రం చెరువు సమీపంలోని చేపల మార్కెట్తో పాటు ట్యాంక్బండ్ పరిసరాల్లోని మత్స్యకారులను సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య సంపద, చేపల విక్రయాలు, మత్స్యకారుల జీవన విధానంపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మదన్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం అందించడమే క్షేత్ర పర్యటనల ఉద్దేశమని తెలిపారు. లైఫ్ సైన్సెస్ హెచ్ఓడీ డాక్టర్ ఎల్. కోదండరాములు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ట్యాంక్బండ్ వద్ద ఎస్డీఆర్ఎఫ్ అధికారులు విద్యార్థులకు విపత్తుల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో

అధ్యాపకులు డాక్టర్ నరేష్, పూజ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో

హైదరాబాద్: మహబూబ్నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఆనంద్నగర్ కాలనీ వయోవృద్ధుల సంఘం సభ్యులను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మన్నె గోవర్ధన్రెడ్డి (ఎంజీఆర్) కలిశారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులు సమాజానికి విలువైన మార్గదర్శకులని, వారి అనుభవాలు, సూచనలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల హక్కుల పరిరక్షణలో ప్రతి ఓటు

కీలకమని, ఓటరు నమోదు ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంఘం కార్యదర్శి ప్రభాకరం, రామ ప్రభాకర్రెడ్డి, విష్ణు, బిట్ల శ్రీనివాస్రాజు, శ్యామ్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల్లో రెండు కొత్త మొక్కల గుర్తింపు

అరుణాచల్ ప్రదేశ్లోని చాంగ్లాంగ్ జిల్లాలో ఉన్న విజయనగర్ ప్రాంతంలో ఓఫియోర్హిజా వంశానికి చెందిన రెండు కొత్త మొక్కల జాతులను పరిశోధకులు గుర్తించారు. అవి ఓఫియోర్హిజా షిడియెన్సిస్, ఓఫియోర్హిజా పెమే. ఈ పరిశోధన వివరాలు అక్టోబర్ 23న ఝఅఝఅఝ అనే శాస్త్రీయ వృక్షశాస్త్ర పత్రికలో ఆన్లైన్లో ప్రచురితమయ్యాయి. ఈ రెండు జాతులు రూబియేసి కుటుంబానికి చెందిన పుష్పించే మొక్కలు.

అరుణాచల్లో రెండు కొత్త మొక్కల గుర్తింపు పరిశోధన

ఈ పరిశోధనలో కృష్ణ చౌలు, రెంథ్లే లాలున్ ఫెలి, డాక్టర్ వినయ్ కుమార్ సహాని పాల్గొన్నారు. పరిశోధకులు 2025 మార్చిలో ఈ మొక్కల ఉనికిని గుర్తించారు. 2026 ఏప్రిల్లో తిరిగి ఆ ప్రాంతాన్ని సందర్శించి నమూనాలను సేకరించారు. వాటి ఆకులు, పువ్వులు, ఇతర బాహ్య లక్షణాలను ఇప్పటికే తెలిసిన జాతులతో పోల్చి, ఇవి కొత్త జాతులని నిర్ధారించారు.

1. ఓఫియోర్హిజా షిడియెన్సిస్

పెరుగుదల: ఇది నిటారుగా పెరిగే బహు వార్షిక మూలిక. సుమారు ఒక మీటరు ఎత్తు వరకు పెరుగుతుంది.

ఆకులు: ఆకుల అడుగు భాగం లేత ఆకుపచ్చ రంగులో ఉంటుంది.

పువ్వులు: గొట్టపు ఆకారంలో ఉండే పువ్వులు

అడుగు భాగంలో తెలుపు రంగులో, మధ్యలో లేత గులాబీ రంగులో, పుష్ప దళాల నోటి భాగం వద్ద గులాబీ-ఎరుపు రంగులో కనిపిస్తాయి.

పేరుకు కారణం: ఈ మొక్కను సేకరించిన ప్రాంతమైన గాంధీ గ్రామ్కు లిసు (లేదా యోబిన్) సమాజం ఉపయోగించే సంప్రదాయ పేరు 'షిడి'. దాని ఆధారంగా ఈ జాతికి ఒష్ట్రఃఅఝఅంఒఅం అనే శాస్త్రీయ నామం పెట్టారు.

2. ఓఫియోర్హిజా పెమే

పోలిక: ఈ జాతి Ophiorrhiza himadrica అనే మరో జాతికి దగ్గరి సంబంధం కలిగి ఉంటుంది.

ప్రత్యేక లక్షణాలు: ఇది సాపేక్షంగా పొడవుగా పెరుగుతుంది. దీని ఆకులు పెద్దవిగా ఉండటంతో పాటు, ఆకుల అంచులు అలల తరహాలో ఉంటాయి. ఆకుల కింది భాగం లేత ఆకుపచ్చ రంగులో ఉంటుంది.

పువ్వులు: లేత గులాబీ నుంచి ఊదా రంగు వరకు కనిపిస్తాయి.

పేరుకు కారణం: అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు గౌరవార్థం ఈ జాతికి Ophiorrhiza pemae అనే పేరు పెట్టారు. ఈ రెండు జాతులను వేరు చేయడంలో ఆకుల పరిమాణం, ఆకుల అంచులు, పుష్పాల రంగు, పుష్పగుచ్ఛాల నిర్మాణం వంటి బాహ్య లక్షణాలు కీలకంగా ఉపయోగపడ్డాయి.

రూబియేసి (Rubiaceae) కుటుంబం

ఇది పుష్పించే మొక్కల కుటుంబం.

అరటిపండుతో అన్నీ లాభాలే.. అవేంటో తెలుసా..?

సీజన్ ఏదైనా అందుబాటులో ఉండే పండు అరటిపండు (Banana). అరటిపండుతో ఆరోగ్య ప్రయోజనాలు (Health benifits) మెండుగా ఉన్నాయి. అందుకే మధుమేహం లేనివాళ్లు ప్రతిరోజు ఒక అరటిపండైనా తీసుకోవాలని వైద్యులు చెబుతుంటారు. అరటిపండులో కార్బోహైడ్రేట్స్ (Carbohydrate), ప్రొటీన్స్ పుష్కలంగా ఉంటాయి. సులభంగా జీర్ణమవుతుంది. మలబద్ధకం (Constipation) ఉన్నవారికి చాలా మేలు చేస్తుంది. అజీర్తి (Indigetion) ని పోగొడుతుంది. మరి ఇంతటి ప్రత్యేకతలున్న అరటిపండు ఆరోగ్యానికి చేసే మేలు ఏంటో తెలుసుకుందాం..

ప్రయోజనాలు..

1. అరటిపండులో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉంటుంది. ఇది ఎముకలు, దంతాలకు చాలా మంచిది. శరీర కండరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.
అరటిపండులో ఉండే పోషకాలు ఆస్తమా, జబ్బుల బారినపడే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.
అధిక రక్తపోటు, క్యాన్సర్ను నివారిస్తాయి.
2. కిడ్నీల ఆరోగ్యానికి కూడా అరటిపండు ఉపకరిస్తుంది. వారానికి రెండు లేదా మూడు అరటి పండ్లు తినడంవల్ల కిడ్నీ సంబంధిత
3. అరటిపండులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మలబద్ధకానికి మంచి మందు. రోజుకో అరటిపండు తింటే ఈ సమస్య తగ్గిపోతుంది.
4. అరటిపండులో కొవ్వులు తక్కువ మోతాదులో ఉంటాయి. బరువు తగ్గాలనుకునేవారు తినవచ్చు. ఇందులో ఉండే పిండిపదార్థం కడుపు నిండిన భావన కలిగించి, ఆకలిని తగ్గిస్తుంది.
5. అరటిపండు పేగులను ఉత్తేజపరుస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
6. అరటి పండులో ఉండే 'బాన్లెక్' అనే రసాయనానికి ఎయిడ్స్ వైరస్పై పోరాడే శక్తి ఉంది. లెక్టిన్ రసాయనం వైరస్ను శరీరంలో ప్రవేశించకుండా అడ్డుకుని ఇన్ఫెక్షన్ను నిరోధిస్తుంది.
7. అరటిపండులో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ శరీరంలో ప్రవేశించగానే సెరటోనిన్గా మారుతుంది. తద్వారా ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ప్రశాంతత కలుగుతుంది. రాత్రిపూట పాలతో కలిపి తీసుకుంటే నిద్ర బాగా పడుతుంది.

ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయండి

- "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026" కర్టెన్ రైజర్‌లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30 : సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్) 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఫలితంగా... ఫ్యాబ్ ఇండస్ట్రీ, చిప్ డిజైన్ విభాగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా ఎదిగేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ – 2026" కర్టెన్ రైజర్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర డిఫెన్స్ ఎగుమతులు గతంతో పోలిస్తే 103 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2030 నాటికి 5 గిగావాట్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే సంకల్పంతోనే గతేడాది "తెలంగాణ రైజింగ్" విజన్ కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా అమలు చేస్తున్న విధానాలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకున్న అనుకూలతలను వివరించి పారిశ్రామికవేత్తలను "రైజింగ్ తెలంగాణ విజన్ లో భాగస్వామ్యం చేసేందుకే ఢిల్లీలో "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ – 2026" కర్టెన్ రైజర్ ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ 2.౦ లో పాల్గొనాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలను కోరారు.

జనసేన ఆధ్వర్యంలో ఘనంగా అలాయ్ బలాయ్ కార్యక్రమం!

- మణికొండలో నిర్వహించిన వేడుకలకు జనసేన పార్టీ రాష్ట్ర, జిల్లా ముఖ్య నాయకుల హాజరు.. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావుకు మద్దతుగా మాట్లాడిన జరుకుల రాజు నాయక్

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన: మణికొండలోని తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గడల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ జనసేన పార్టీ ఇన్‌చార్జి, అఖిల భారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు జరుకుల రాజు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సోదరభావం, ఐక్యతను చాటిచెప్పే అలాయ్ బలాయ్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మేడ రామకృష్ణ ముఖ్య నాయకులుగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, జనసైనికులు, చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమష్టిగా పనిచేస్తాం

ఈ సందర్భంగా జరుకుల రాజు నాయక్ మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా గడల శ్రీనివాసరావుకు మద్దతుగా పార్టీ శ్రేణులన్నీ సమష్టిగా పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో జనసేన నాయకులు, జనసైనికులు, చిరంజీవి అభిమానులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పట్టభద్రుల సమస్యల పరిష్కారం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని పార్టీ శ్రేణులు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. గడల శ్రీనివాసరావు గెలుపు కోసం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేస్తామని, ప్రతి నియోజకవర్గంలో జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్తారని రాజు నాయక్ వెల్లడించారు.

పార్టీ శ్రేణుల ఐక్యతకు వేదిక

అలాయ్ బలాయ్ వంటి ఆత్మీయ కార్యక్రమాలు నాయకులు, కార్యకర్తల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని నాయకులు పేర్కొన్నారు. రాజకీయ కార్యక్రమాలతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజలతో మమేకం కావడం ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు పోతిగంటి బాలరాజ్, జిల్లేడు చౌదరిగూడ మండల ఇన్‌చార్జి భూమగళ్ల రామకృష్ణ, కేశంపేట మండల సీనియర్ జనసేన నాయకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల పరస్పర ఆత్మీయ పలకరింపులు, ఐక్యతా సందేశాల మధ్య కార్యక్రమం ముగిసింది.

అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

- బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలకు ఎమ్మెల్సీ ఓటుతో సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్ద్య: అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ సూచించారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని భవిత జూనియర్, డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేట్లను కలిసి ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు ఎంతో విలువైనదని, యువత తమ హక్కులను కాపాడుకోవడంతో పాటు ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా నిలవాలని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసిందో పట్టభద్రులు ఆలోచించాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే సమయం ఆసన్నమైందని అన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీకి గ్రాడ్యుయేట్లు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. "మీ ఓటు మీ గొంతుక.. మీ ఓటు మీ భవిష్యత్తుకు బాట" అని పేర్కొంటూ, పట్టభద్రుల హక్కుల పరిరక్షణ కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని బొడ్డుపల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లావత్ లక్ష్మణ్, చాట్ల ప్రశాంత్, రాంబాబు, శ్రీరాములు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ రెడ్డి నగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎలక్షన్ కమిటీ నియామకం

ఉప్పల్,అక్టోబర్ 30(భవిష్యత్ ప్రజా పాలన): వెంకట్ రెడ్డి నగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలను పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడానికి ప్రత్యేక ఎలక్షన్ కమిటీని నియమిస్తున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ గడ్డం సాయి కిరణ్ తెలిపారు. ఈ ఎలక్షన్ కమిటీకి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పూర్తి బాధ్యతలను కాలనీ అధ్యక్షుడు గడ్డం సాయి కిరణ్ అప్పగించారు.

ఎలక్షన్ కమిటీ ముఖ్య బాధ్యతలు, నిబంధనలు:

ఇంటింటి సర్వే: ఎలక్షన్ కమిటీ సభ్యులు కాలనీలోని ప్రతి ఇంటి యజమాని వివరాలను సేకరించి, అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పిస్తూ ఇంటింటి సర్వే నిర్వహిస్తారు.

పోటీకి అనర్హత: ఎలక్షన్ కమిటీలో నియమితులైన ఏ సభ్యుడూ కూడా రాబోయే కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏ పదవికి పోటీ చేయడానికి అర్హులు కారు.

బాధ్యత కాలపరిమితి: ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి సర్వే నిర్వహణ, ఓటర్ల జాబితా రూపకల్పన, పోలింగ్ నిర్వహణ మరియు ఫలితాలు వెల్లడించే వరకు ఈ కమిటీయే పూర్తి బాధ్యత వహిస్తుంది.

నూతన అధ్యక్షుడి ఎన్నిక వరకు: ఎన్నికల ఫలితాలు వెలువడి, నూతన అధ్యక్షుడు మరియు కమిటీ ఎన్నుకోబడే వరకు ప్రస్తుత అధ్యక్షుడిగా గడ్డం సాయి కిరణ్ కొనసాగుతారు.



ఎన్నికల విధివిధానాల సమగ్ర ప్రకటన: రాబోయే ఎన్నికలను ఏ విధంగా, ఏ పద్ధతిలో నిర్వహిస్తాం, పోలింగ్ రోజు పాటించాల్సిన నియమాలు, నామినేషన్ల ప్రక్రియ మొదలైన పూర్తి విధివిధానాలు, ఎన్నికల షెడ్యూల్‌ను ఎలక్షన్ కమిటీ త్వరలోనే కాలనీ ప్రజలకు వివరంగా ప్రకటిస్తుంది.

ఎలక్షన్ కమిటీ సభ్యుల జాబితా:

పి.బుచ్చిరెడ్డి,బిల్లకంటి యాదయ్య, లక్ష్మణ్, ప్రసాద్ శర్మ, సోమశేఖర్ గౌడ్, నాగుల కనకయ్య, బాణాల నారాయణ, దూకిడి నాగేశ్వర్‌రావు,పెంటం రమేష్,గోడిశాల నరేష్ గౌడ్,ఆవుల సుధాకర్,కానుకంటి రాము గౌడ్, శంకర్ చారి,తోట శ్రీనివాస్, సుధగాని మల్లేష్ గౌడ్, మద్దికుంట శ్రీనివాసులు, రంగనాథ్ ప్రసాద్, పూజారి శశి, దివిటి శ్రీకాంత్, గుడుగుంట్ల మల్లేష్, కాలనీ ప్రజలందరూ ఈ ఎలక్షన్ కమిటీకి సహకరించి, సర్వేలో పాల్గొని ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాల్సిందిగా గడ్డం సాయి కిరణ్ అధ్యక్షులు, వెంకట్‌రెడ్డి నగర్ డెవలప్ మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపు

- విద్యుత్తు సంస్థల సీఎండీలను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 19.272 నుంచి 21.815 శాతానికి పెంపు.. జూలై 1 నుంచి వర్తింపు
- 71,360 మందికి ప్రయోజనం.. నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30 : రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి చెల్లించే కరువు భత్యం (డీఏ), కరువు ఉపశమనం (డీఆర్) పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలను ఆదేశించారు. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ, డీఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది. కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డీఏ, డీఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

సంస్థల వారీగా లబ్ధిదారులు ఇలా..

టీజీ ట్రాన్స్‌కో పరిధిలో 3,081 మంది ఉద్యోగులు, 3,644 మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,194 మందికి ప్రయోజనం కలగనుంది. టీజీ జెన్‌కోలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు కలిపి 14,167 మంది లబ్ధి పొందనున్నారు. టీజీ ఎస్పీడీసీఎల్‌లో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు కలిపి 28,481 మందికి, టీజీ ఎన్పీడీసీఎల్‌లో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు కలిపి 19,518 మందికి ప్రయోజనం చేకూరనుంది. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, విద్యుత్ సంస్థల సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగానే ఈ డీఏ, డీఆర్ పెంచాలని ఆదేశాలు ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో డిప్యూటీ నర్సింగ్ సూపర్డెంట్ మంజుల రాణికి ఘన సత్కారం....

నాగర్ కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో డిప్యూటీ నర్సింగ్ సూపర్డెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె మంజుల రాణికి శుక్రవారం నాడు ఆసుపత్రి ఆవరణలో ఆత్మీయ పదవి విరమణ సభలో ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ పి సుప్రియ శాలువలతో ఘనంగా సత్కరించారు. 36 సంవత్సరాల ఆరోగ్య శాఖలో విధులు నిర్వహించి వివిధ ఉద్యోగ స్థాయిలో నేటి వరకు చేసిన సేవలను పలువురు వైద్యులు నర్సింగ్ అధికారులు ఆమె సేవలను గుర్తు చేశారు. స్టాఫ్ నర్స్ గా నాగర్ కర్నూల్ సివిల్ ఆసుపత్రిలో విధుల్లో చేరి డిప్యూటీ నర్సింగ్ సూపర్డెంట్‌గా పదవి విరమణ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నాగర్ కర్నూల్ లో పదవి విరమణ కావడం ఎంతో అదృష్టమని అన్నారు. గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పలు అవార్డులు అందుకున్న తీరును పలువురూ వైద్యులు, అధికారులు,సిబ్బంది ప్రశంసించారు. గతంలో అక్షరాస్యత ,సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు, ఆరోగ్య సేవల శాస్త్రీయతను, కరోనా సమయంలో చేసిన ఆరోగ్య సేవలను పలువురు గుర్తుచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జనార్ధన్, వివిధ విభాగాల ప్రొఫెసర్లు డాక్టర్ ఉమాకాంత్, డాక్టర్ శ్రీకాంత్, ఆర్ఎమ్ డాక్టర్ అజీమ్, నర్సింగ్ సూపర్డెంట్ సంగీత, డిప్యూటీ నర్సింగ్ సూపర్డెంట్లు పేర్సీ సుమన్, సలేహా, నాగవేణి, ఉప సంచాలకులు సీజే వసంత్ కుమార్, నర్సింగ్ అధికారులు, బంధుమిత్రులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఆకాంక్షలకు

అద్దం పడుతున్న ప్రాపర్టీ షో 16వ NAREDCO తెలంగాణ ప్రాపర్టీ షో

- నగర దీర్ఘకాలిక వృద్ధిపై పరిశ్రమ విశ్వాసం
- హోమ్ బయ్యింగ్ ను మరింత సులభతరం చేసే దిశగా NAREDCO కృషి
- కోశాధికారి కొండల సుధాకర్ రెడ్డి. వసవి గ్రూప్, గంగోత్రి ఇన్ ఫ్రా ఆధ్వర్యంలో 16వ ప్రాపర్టీ షో
- గృహ కొనుగోలుదారులకు భరోసా

నల్లగొండ/ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ రోజురోజుకూ మారుతున్న ఆకాంక్షలకు ప్రతిబింబంగా ప్రాపర్టీ షో నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన డెవలపర్ల నుండి పెరుగుతున్న భాగస్వామ్యం చూడడం చాలా ప్రోత్సాహకరంగా ఉందని, ఇది మార్కెట్ యొక్క లోతును, నగర దీర్ఘకాలిక వృద్ధి కథపై పరిశ్రమకు ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చీూ=జుణజూ తెలంగాణ కోశాధికారి కొండల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... ఒక ఇంటిని కొనుగోలు చేయడం అనేది తరచుగా ఒక కుటుంబానికి అత్యంత ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలలో ఒకటి అని అన్నారు. ప్రాపర్టీ షోలో ప్రముఖ ఆర్థిక సంస్థల ఉనికి గృహ కొనుగోలు ప్రయాణాన్ని కస్టమర్లకు మరింత అందుబాటులో, పారదర్శకంగా, సౌకర్యవంతంగా మార్చడానికి పరిశ్రమ చేస్తున్న సమిష్టి కృషికి నిదర్శనమని తెలిపారు.

16వ NAREDCO తెలంగాణ ప్రాపర్టీ షో స్పాన్సర్లు:

పవర్డ్ బై స్పాన్సర్లుగా వసవి గ్రూప్, గంగోత్రి ఇన్ ఫ్రా ఎడ్జ్ వ్యవహరిస్తున్నారు.

లింగమంతుల స్వామి ఆలయానికి మహర్దశ..

- ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన
- జాతరలోపు సీసీ రోడ్లు, ఆలయ ముఖద్వారం పూర్తి చేస్తాం: బీర్ల ఐలయ్య



గుండాల అక్టోబర్ 30 యాదాద్రి జిల్లా భవిషత్ ప్రజా పాలన: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని తుర్కలశాపురం గ్రామంలో కొలువుదీరిన లింగమంతుల స్వామి ఆలయ ముఖద్వార నిర్మాణానికి ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ ముఖద్వారాన్ని ఎంత ఖర్చయినా వెనుకాడకుండా, ఆలేరు నియోజకవర్గంలోనే అత్యంత సుందరంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తన సోదరుడు ఈరసరపు యాదగిరి గౌడ్ పర్యవేక్షణలో గ్రామ ప్రజల అభిరుచికి అనుగుణంగా ముఖద్వార నిర్మాణం చేపడతామని తెలిపారు. వచ్చే మార్చిలో జరిగే లింగమంతుల స్వామి జాతరలోపు ఆలయ ముఖద్వారంతో పాటు గ్రామంలోని సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యాదవ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

"నిజమైన స్కాట్ అండ్ గైడ్ అంటే యూనిఫామ్ ధరించిన వ్యక్తి మాత్రమే కాదు.. నిస్వార్థ సేవ, క్రమశిక్షణ, ధైర్యం, కరుణ వంటి విలువలను జీవితంలో ఆచరించేవారు"

- "సమాజ సేవకు సిద్ధంగా ఉండాలి..
- వ్యక్తిత్వ నిర్మాణం, నిస్వార్థ సేవే నిజమైన నాయకత్వానికి పునాదులు": ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- "రాష్ట్రంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను విస్తరించాలి":మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30 : దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ ఆధునీకరణ, పునరుద్ధరణ పనులకు సింగరేణి సంస్థ నుంచి రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు. హైదరాబాద్ దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యాలయంలో ఉన్న మోడల్ హైస్కూల్ ఆధునీకరణ, పునరుద్ధరణ పనులకు శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడంతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆధునీకరణ, పునరుద్ధరణ పనులకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్పొరేట్‌కు సి.ఎస్.ఆర్ నిధుల కింద రూ.2.50 కోట్ల ఆర్థిక సహాయం అందించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐదు ఎకరాల ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. నైతిక విలువలు కలిగిన బలమైన, స్వయం సమృద్ధి దేశ నిర్మాణానికి విద్య, యువత సాధికారత, వ్యక్తిత్వ నిర్మాణం పునాదులని పేర్కొన్నారు. నిజమైన స్కౌట్ అండ్ గైడ్ అంటే కేవలం యూనిఫామ్ ధరించిన వ్యక్తి మాత్రమే కాదని, నిస్వార్థ సేవ, క్రమశిక్షణ, ధైర్యం, కరుణ వంటి విలువలను జీవితంలో ఆచరించేవారని అన్నారు. విద్యార్థుల ప్రతిభను కేవలం విద్యా మార్కులతో మాత్రమే అంచనా వేయలేమని, ఉత్తమ నైతిక విలువలు, సమాజ సేవ పట్ల నిబద్ధతతో సమాజాన్ని ప్రభావితం చేయడమే నిజమైన విద్యకు నిదర్శనమని స్పష్టం చేశారు. పాఠశాల ఆధునీకరణకు సింగరేణి సంస్థ ద్వారా రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ నిధులను సమకూర్చడంలో చొరవ చూపిన తెలంగాణ ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కకు గవర్నర్ అభినందనలు తెలిపారు. ఈ నిధులతో తరగతి గదుల అభివృద్ధి, డిజిటల్ విద్యా మౌలిక సదుపాయాలు, క్రీడా సౌకర్యాలను మెరుగుపరచనున్నట్లు పేర్కొన్నారు. ఐదు ఎకరాల ప్రాంగణ సుందరీకరణకు సహకరిస్తున్న జీహెచ్ఎంసీని కూడా అభినందించారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలకు, ముఖ్యంగా గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలలకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను విస్తరించాలని, ప్రతి విద్యార్థికి స్కౌటింగ్, గైడింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యత్వం 2024–25లో 17,184 నుంచి 2025–26లో 1,494 యూనిట్ల పరిధిలో 47,448కు పెరగడాన్ని గవర్నర్ ప్రస్తావించి అభినందించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వంటి సంస్థలతో సమన్వయం చేసుకుంటూ సమాజ సేవా కార్యక్రమాలను విస్తరించాలని కోరారు. స్కౌట్ గీతంలోని స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని తెలుగు, హిందీ భాషల్లో రాసి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో, అలాగే లోక్‌భవన్‌లో ప్రముఖంగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వ్యక్తిత్వ నిర్మాణం, నిస్వార్థ సేవే నిజమైన నాయకత్వానికి గుర్తులని పేర్కొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాథమిక నినాదమైన "సిద్ధంగా ఉండండి" స్ఫూర్తితో సమాజ సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు (AI), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో నైతిక విలువలు, క్రమశిక్షణ, పరస్పర సహకారం, పౌర బాధ్యతలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయని అన్నారు. ఈ విలువలే బాధ్యతాయుతమైన పౌర సమాజానికి, సమర్థవంతమైన పాలనకు పునాదులని వివరించారు. తెలంగాణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు విస్తరిస్తూ 3,200 పాఠశాలల్లో 1.30 లక్షల మంది విద్యార్థులకు చేరువ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పాఠశాల మౌలిక సదుపాయాల ఆధునీకరణ, తరగతి గదుల అభివృద్ధి, క్రీడా సౌకర్యాల కల్పనకు సింగరేణి సంస్థ ద్వారా రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ నిధులు సమకూర్చడంతో పాటు జీహెచ్ఎంసీ అలాగే ఇతర సంస్థలు అందిస్తున్న సహకారాన్ని ప్రస్తావించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం యువత

సాధికారతకు, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో క్రమశిక్షణ, పౌర బాధ్యత, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్రంలోని అన్ని ఎస్సీ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో స్కౌటింగ్, గైడింగ్ కార్యక్రమాలను విస్తరించాలని అధికారులకు సూచించారు. తద్వారా గ్రామీణ, వెనుకబడిన, అణగారిన వర్గాల విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, సమాజ సేవలో సమాన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమిషనర్ దానకిశోర్, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి నవీన్ నికోలస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

ఆశపోతు కుక్క



ఒక ఊరిలో రాము అనే ఒక కుక్క ఉండేది. దానికి ఎప్పుడూ ఏదో ఒక ఆహారం దొరుకుతూనే ఉండేది, కానీ దానికి అసలు తృప్తి ఉండేది కాదు. ఒకరోజు రాముకు ఒక పెద్ద మాంసపు ముక్క దొరికింది. దాంతో అది చాలా ఆనందపడింది. "ఎవరైనా చూస్తే ఈ ముక్కను లాగేసుకుంటారు. కాబట్టి ఊరి చివర ఉన్న నది దాటి అవతలి ఒడ్డుకు వెళ్లి ప్రశాంతంగా తింటాను" అని అనుకుంది. దాము నోట మాంసపు ముక్కను కరుచుకుని నదిపై ఉన్న ఒక చిన్న చెక్క వంతెనపై నడవసాగింది. నది మధ్యలోకి రాగానే, అలవాటు ప్రకారం కింద ఉన్న నీటిలోకి చూసింది. నీరు చాలా స్పష్టంగా ఉండటంతో, అందులో రాముకు తన నీడ కనిపించింది.
కానీ ఆశపోతు రాము అది తన నీడ అని గమనించలేదు. నీటిలో మరొక కుక్క ఉందని, దాని నోట్లో కూడా తనకంటే పెద్ద మాంసపు ముక్క ఉందనుకుంది. "ఆ కుక్కను భయపెట్టి, దాని నోట్లోని ముక్కను కూడా లాక్కుంటే ఈరోజు నాకు పెద్ద పండగే!" అని అత్యాశ పడింది. అంతే, కింద ఉన్న నీడను చూసి గట్టిగా మొరగడానికి "భౌ భౌ" అంటూ నోరు తెరిచింది. నోరు తెరవడమే ఆలస్యం, దాని నోట్లో ఉన్న అసలైన మాంసపు ముక్క కాస్తా జారి నది నీటిలో పడి కొట్టుకుపోయింది. తన అత్యాశ వల్ల ఉన్న ముక్కను పోగొట్టుకుని, ఆకలితో అలమటిస్తూ రాము ఇంటికి తిరిగొచ్చింది.

నీతి: ఉన్నదానితో తృప్తి పడాలి. లేనిదాని కోసం అత్యాశ పడితే, ఉన్నది కూడా ఊడుతుంది.

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

- సమ్మిళిత అభివృద్ధి, సుస్థిరత, ప్రజాకేంద్రిత పాలనతోనే లక్ష్య సాధన
- ఆర్థిక వృద్ధి ఫలాలు సామాన్య ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పుగా ప్రతిబింబించాలి
- పర్యావరణ పరిరక్షణ, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి, ప్రజల అవసరాలకు అనుగుణమైన విధానాల రూపకల్పనకు పిలుపు

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30 : తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనే లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన ప్రతిభ, పారిశ్రామిక సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం రాష్ట్రానికి పుష్కలంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అలాగే ఆర్థిక వృద్ధి కేవలం స్థూల ఆర్థిక గణాంకాలు, తలసరి ఆదాయ పెరుగుదలకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల జీవన ప్రమాణాల్లో స్పష్టమైన మార్పును తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ.) స్వర్ణోత్సవాల సందర్భంగా తుంగభద్ర బ్లాక్, శ్రవణ్ కుమార్ హాల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి , ప్రజా విధానాలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ. ప్రచురించే సమృద్ధి జర్నల్ ప్రత్యేక సంచికను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

ఆర్థిక వృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలి

తెలంగాణలో ఐటీ, లైఫ్ సైన్సెస్, కీలక సేవారంగాల్లో హైదరాబాద్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావిస్తూ, రాష్ట్రానికి ఉన్న పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలను సమర్థంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే వాస్తవ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక సూచీలు పెరగడం మాత్రమే కాదని, యువతకు భద్రమైన ఉపాధి అవకాశాలు, ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలు, వ్యవసాయ రంగానికి ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలని అన్నారు. హైదరాబాద్‌లో కేంద్రీకృతమవుతున్న ఆర్థిక ప్రగతి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ఫ్రైట్ కారిడార్లు, ప్రత్యక్ష మార్కెట్ అనుసంధానాలు, జిల్లాల వారీగా పారిశ్రామిక అవకాశాల కల్పన ద్వారా పట్టణ, పల్లె ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించాలని సూచించారు. యువత వ్యవసాయ సంక్షోభం కారణంగా కాకుండా మెరుగైన అవకాశాలు, ఉన్నత ఆశయాల కోసం తమ ప్రాంతాలను విడిచి వెళ్లే పరిస్థితులు కల్పించడమే సమతుల్య అభివృద్ధి లక్ష్యమని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే సుస్థిర అభివృద్ధి

సుస్థిర అభివృద్ధి ఆవశ్యకతను వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణను విస్మరించి చేపట్టే అనాలోచిత పట్టణ విస్తరణ భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఉప ముఖ్యమంత్రి హెచ్చరించారు. చెరువులు, సహజ నీటి వనరులు కనుమరుగయ్యేలా చేసే అశాస్త్రీయ అభివృద్ధి కారణంగా భవిష్యత్తులో వరద నివారణ, సహాయక చర్యల కోసం ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని, ప్రస్తుత నిర్ణయాల భారాన్ని రాబోయే తరాలపై మోపకూడదని అన్నారు. మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక పట్టణాభివృద్ధి కార్యక్రమాలు పర్యావరణ సమతుల్యత, ప్రజారోగ్య పరిరక్షణ, ప్రభావిత కుటుంబాలకు గౌరవప్రదమైన మరియు నాణ్యమైన పునరావాసం అనే అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. సుస్థిరత అనేది పర్యావరణ బాధ్యత మాత్రమే కాకుండా ఆర్థిక క్రమశిక్షణకు కూడా సంబంధించిన అంశమని పేర్కొంటూ, బాధ్యతాయుతమైన బడ్జెట్ నిర్వహణ, స్వచ్ఛ ఇంధన వినియోగం, మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం, వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే సంస్థాగత వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న అనిశ్చితి, మార్పుల భారాన్ని రైతులు ఒంటరిగా భరించాల్సిన పరిస్థితి రాకుండా తగిన రక్షణ వ్యవస్థలు కల్పించాలని సూచించారు. ఒక ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం ఒక్కసారే జరిగినప్పటికీ, దాని నిర్వహణ బాధ్యత ప్రతిరోజూ కొనసాగుతుందని పేర్కొంటూ, దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఉద్ఘాటించారు.

ప్రజల అవసరాలే ప్రజా విధానాలకు ప్రాతిపదిక కావాలి

ప్రజా విధానాలు, పరిపాలనా సంస్కరణలపై మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల మధ్య ఉన్న విభాగపరమైన గోడలను తొలగించి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఉప ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. వ్యవసాయం, విద్యుత్, సాగునీటి శాఖల విధానాలు విడివిడిగా కాకుండా రైతు జీవితాన్ని సమగ్రంగా దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని అన్నారు. ప్రజలకు అందించే సేవల్లో వారి సమయాన్ని కూడా పరిపాలనా సామర్థ్యాన్ని కొలిచే ముఖ్యమైన ప్రమాణంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. ఒక రోజువారీ కూలీ ప్రభుత్వ కార్యాలయం చుట్టూ పదేపదే తిరగాల్సి రావడం వల్ల అతను కోల్పోయే ఆదాయం గుర్తించబడని ఆర్థిక నష్టమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనా సంస్కరణలు ప్రజలకు సేవలను మరింత సులభతరం చేయాలే తప్ప అదనపు ఇబ్బందులకు కారణం కాకూడదని స్పష్టం

చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న హక్కుల ఆధారిత సంక్షేమ విధానాలను ప్రస్తావిస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకం, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్న గృహజ్యోతి పథకం, 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అంతర్జాతీయ ప్రమాణాలతో 108 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, 14 వేల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పడకల విస్తరణ వంటి కార్యక్రమాలను వివరించారు. సామాజిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలను తక్కువ ప్రాధాన్యత కలిగిన బాధ్యతలుగా కాకుండా సమాజంలో శాశ్వతమైన మార్పు తీసుకురాగల కీలక పరిపాలనా రంగాలుగా అధికారులు భావించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రంగాల్లో పనిచేసే అధికారులకు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకువచ్చే గొప్ప అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా దాదాపు 12 రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, విధాన నిపుణులు, అధ్యాపకులు పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, కర్ణాటక, కేరళ, పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర ప్రాంతాల నుంచి సుమారు 200 మంది పరిశోధనా పత్రాల సమర్పకులు పాల్గొంటున్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి.ఐ.డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, అదనపు డైరెక్టర్ జనరల్ అనితా రామచంద్రన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ఇతర ప్రముఖ విద్యావేత్తలు,పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలివైన కాకి

(ఉపాయం ఉన్నవాడికి అపాయం లేదు)

అది ఒక ఎండాకాలం. ఎండలు చాలా తీవ్రంగా ఉండటంతో అడవిలోని చెరువులు, బావులు అన్నీ ఎండిపోయాయి. ఆ అడవిలో చిక్కూ అనే ఒక కాకి ఉండేది. దానికి విపరీతమైన దాహం వేసింది. నీటి కోసం అడవి అంతా తిరిగింది, కానీ ఎక్కడా ఒక చుక్క నీరు కూడా దొరకలేదు. దాహంతో దాని ప్రాణాలు పోయేలా అనిపించాయి. చివరకు ఎగురుతూ ఒక ఊరి చివర ఉన్న తోటలోకి వచ్చింది. అక్కడ దానికి ఒక మట్టి కుండ కనిపించింది. ఆశగా కుండ దగ్గరకు వెళ్లి లోపలికి చూసింది. కుండ అడుగున కొద్దిగా నీరు ఉంది. కానీ కాకి తన ముక్కును లోపలికి దూర్చినా నీటిని అందుకోలేకపోయింది. కాకి నిరాశ చెందలేదు. "ఎలాగైనా ఈ నీటిని తాగాలి" అని చుట్టూ చూసింది. అక్కడ చిన్న చిన్న రాతి ముక్కలు (కనుమలు) కనిపించాయి. వెంటనే దానికి ఒక చక్కని ఉపాయం తట్టింది. చిక్కూ ఓపికగా ఒక్కొక్క రాయిని తన ముక్కుతో కరుచుకుని తెచ్చి కుండలో వేయడం ప్రారంభించింది. రాళ్లు కుండ అడుగున చేరేకొద్దీ, నీటి మట్టం నెమ్మదిగా పైకి రాసాగింది. అలా చాలా రాళ్లు వేసిన తర్వాత నీరు కుండ పైభాగం వరకు వచ్చింది. కాకి ఆనందంగా ఆ నీటిని తాగి, తన దాహాన్ని తీర్చుకుని హాయిగా ఎగిరిపోయింది.

మేకల దొంగల ముఠా గుట్టురట్టు.. ఐదుగురు నిందితుల అరెస్ట్

- నాలుగు మేకలు స్వాధీనం.. మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు

గుండాల అక్టోబర్ 30 యాదాద్రి జిల్లా భవిషత్ ప్రజా పాలన: గుండాల పోలీస్ స్టేషన్ పరిధిలోని రామారం గ్రామ శివారులో ముక్కెర లింగయ్యకు చెందిన మేకల కొట్టంలో జరిగిన మేకల దొంగతనం కేసును గుండాల పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నాలుగు మేకలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.ఈ నెల 28.10.2026 రాత్రి నిందితులు సెల్ఫ్ డ్రైవ్ కారులో వచ్చి రామారం గ్రామ శివారులోని మేకల కొట్టంలో ప్రవేశించి ఐదు మేకలను

దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది.ఈ కేసులో పాలడుగు మణితేజ, మర్రికుక్కల నాగరాజు, చాపల సాయికుమార్, పనుగంటి దుర్గాప్రసాద్, చింతలపల్లి రాకేష్ అనే ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న మరో వ్యక్తి నార్కట్పల్లి హరిబాబు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి నాలుగు మేకలను స్వాధీనం చేసుకోగా, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గుండాల ఎస్ఐ మాట్లాడుతూ. గ్రామాల్లో ప్రజలు తమ పశువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

డిగ్రీ అర్హతతో రైల్వేలో 1250 స్టేషన్ మాస్టర్ పోస్టులు.. నవంబర్ 25 చివరితేదీ

రైల్వే పరీక్షల చరిత్రలో తొలిసారి స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చీూజ రిక్రూట్‌మెంట్ నుంచి RRB వేరు చేసింది. దేశ వ్యాప్తంగా వివిధ రైల్వే స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 1250 పోస్టులను భర్తీ చేయనుంది. అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. దరఖాస్తు ప్రక్రియ రేపటి (అక్టోబర్ 27) నుంచి ప్రారంభం కానుంది. నవంబర్ 25తో ముగుస్తుంది.

పోస్టు

స్టేషన్ మాస్టర్. ఈ పోస్టులను RRBలు అహ్మదాబాద్, అజ్మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘర్, చెన్నై, గోరఖ్‌పూర్, జమ్మూ–శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురంలలో నింపుతారు. ఖాళీలు త్వరలో ప్రకటిస్తారు.

అర్హతలు

అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు

2027, జనవరి 1 నాటికి అభ్యర్థుల కనీస వయసు 20 ఏండ్లు, గరిష్ఠ వయసు 30 ఏండ్లు ఉండాలి. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం రిజర్వేషన్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంది.

ఎంపిక

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (CBT), కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (CBAT), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ఎంపిక చేస్తారు.CBT 100 మార్కులకు ఉంటుంది. 120 నిమిషాల్లో రాయాలి. దీనిలో బేసిక్ సైన్స్, మ్యాథమెటిక్స్ అండ్ అనలిటికల్ క్యాపబిలిటీ (60), లాజికల్ క్యాపబిలిటీ (రీడింగ్ కాంప్రహెన్షన్) 20, మెంటల్ రీజనింగ్ 20 ప్రశ్నలు ఇస్తారు.CBTలో మెరిట్ ఆధారంగా CBATకి పిలుస్తారు. ఇది సంబంధిత RRBలోని ప్రతి ఖాళీకి సుమారు 8 మందిని ఎంపిక చేస్తారు. మెడికల్ స్టాండర్డ్‌లో దూరం చూపు 6/9, దగ్గరి చూపు Sn- 0.6 ఉండాలి.

శనివారం,
అక్టోబర్ 31, 2026
భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక

అక్కాతమ్ముడి అనుబంధం.. సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు 'కిల్లర్'

- **విభిన్న పాత్రల్లో జ్యోతి పూర్వజ్ నటన ప్రత్యేక ఆకర్షణ**
- **తమ్ముడి పాత్రలో మిస్టర్ చందు అద్భుత అభినయం**
- **దర్శకుడు, రచయిత, నిర్మాత, ఎడిటర్‌గా సుకు పూర్వాజ్**
- **సైన్స్ ఫిక్షన్, యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో ఆసక్తికర కథనం**

భవిష్యత్ ప్రజా పాలన,హైదరాబాద్ ప్రతినిధి, సీనియర్ జర్నలిస్ట్ Anji, హైదరాబాద్: సినిమా రంగంలో విభిన్న కథాంశాలు, కొత్త తరహా ప్రయోగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న తరుణంలో సైన్స్ ఫిక్షన్, యాక్షన్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన 'కిల్లర్' చిత్రం ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. అక్కాతమ్ముడి మధ్య ఉండే అనుబంధాన్ని భావోద్వేగపూరితంగా చూపించడంతో పాటు, సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో ఉత్కంఠభరితమైన కథనాన్ని ఈ చిత్రం అందిస్తోంది. కుటుంబ బంధాలు, విభిన్న వ్యక్తిత్వాలు, జ్ఞాపకాల గందరగోళం, రహస్య శక్తులతో పోరాటం వంటి అంశాలు కథలో కీలకంగా నిలుస్తున్నాయి. ఒకవైపు అక్కాతమ్ముడి మధ్య ఉండే ప్రేమ, అనుబంధం ప్రేక్షకుల మనసులను తాకే అంశంగా కనిపిస్తుండగా, మరోవైపు సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో సాగే సంఘటనలు కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. సాధారణ కథలకు భిన్నంగా కొత్త ఆలోచనతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులకు మరో తరహా అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తోంది.

విభిన్న పాత్రల్లో హీరోయిన్.. కథకు ప్రత్యేక ఆకర్షణ

ఈ చిత్రంలో హీరోయిన్ జ్యోతి పూర్వజ్ పలు విభిన్న పాత్రల్లో కనిపించడం విశేషం. ఒకే నటిగా భిన్నమైన వ్యక్తిత్వాలు, పరిస్థితులు, భావోద్వేగాలను తెరపై ప్రదర్శించడం నటనాపరంగా సవాలుతో కూడుకున్న విషయం. కథలోని సైన్స్ ఫిక్షన్ అంశాలకు అనుగుణంగా ఆమె పాత్రలు మారుతూ ఉండటం సినిమాకు ప్రత్యేకతను తీసుకొస్తోంది. కథా నేపథ్యం ప్రకారం ఒక మహిళ హై-కాన్సెప్ట్ సైన్స్ ఫిక్షన్ ప్రపంచంలో చిక్కుకుపోతుంది. తనకు సంబంధించిన జ్ఞాపకాలు ముక్కలుగా విడిపోవడం, ప్రమాదకరమైన వ్యక్తిత్వాలను ఎదుర్కోవడం, తన వాస్తవ ప్రపంచాన్ని తిరిగి పొందేందుకు రహస్య శక్తులతో పోరాడాల్సిన పరిస్థితులు ఆమెకు ఎదురవుతాయి. ఈ ప్రయాణంలో ఎదురయ్యే మానసిక సంఘర్షణలు, ప్రమాదాలు, అనూహ్య పరిణామాలు కథను ఉత్కంఠభరితంగా ముందుకు నడిపిస్తాయి.

తమ్ముడి పాత్రలో మిస్టర్ చందు అద్భుత నటన

'కిల్లర్' చిత్రంలో ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాల్సిన అంశం తమ్ముడి పాత్రలో మిస్టర్ చందు నటన. అక్కాతమ్ముడి మధ్య ఉండే అనుబంధం, ఆప్యాయత, భావోద్వేగాలను తన నటన ద్వారా చక్కగా వ్యక్తీకరించడం విశేషం. పాత్రకు తగిన సహజత్వంతో నటిస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. సినిమాలో యాక్షన్, థ్రిల్లర్ అంశాలు ఎంత ముఖ్యమో, కుటుంబ బంధాలకు సంబంధించిన భావోద్వేగాలు కూడా అంతే ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ముఖ్యంగా అక్కాతమ్ముడి మధ్య ఉండే అనుబంధాన్ని ప్రేక్షకులకు చేరవేయడంలో తమ్ముడి పాత్ర కీలకంగా ఉంటుంది. ఈ పాత్రలో మిస్టర్ చందు తనదైన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉంది.

పల్లెటూరి నుంచి మీడియా రంగం.. ఇప్పుడు సినిమా రంగంలో మరో అడుగు

మిస్టర్ చందు ప్రయాణం ఎంతో ఆసక్తికరమైనది. పల్లెటూరి నేపథ్యం నుంచి వచ్చిన ఆయన మీడియా రంగంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, తనకంటూ ఒక గుర్తింపు సంపాదించుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. మీడియా రంగంలో కొనసాగుతూనే సినిమా రంగంలో నటుడిగా అడుగుపెట్టి మంచి సినిమాలో అవకాశం దక్కించుకోవడం అభినందించదగిన విషయం. నేపథ్యం ఏదైనా సరే ప్రతిభ, ఆసక్తి, పట్టుదల ఉంటే కొత్త రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆయన ప్రయాణం తెలియజేస్తోంది. పల్లెటూరి నుంచి వచ్చి మీడియా రంగంలో కొనసాగుతూ, ఈ రోజు 'కిల్లర్' వంటి విభిన్న కథాంశం ఉన్న సినిమాలో నటించడం ఎంతో మంచి పరిణామం. ముఖ్యంగా తమ్ముడి పాత్రలో ఆయన చూపించిన నటన మరింత మంచి అవకాశాలకు మార్గం చూపాలని సినీ అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

దర్శకుడు సుకు పూర్వాజ్ బహుముఖ ప్రతిభ

ఈ చిత్రానికి సుకు పూర్వాజ్ దర్శకత్వం వహించడంతో పాటు కథ, నిర్మాణం, ఎడిటింగ్ బాధ్యతలను కూడా నిర్వహించారు. దర్శకుడిగా, రచయితగా, నిర్మాతగా, ఎడిటర్‌గా ఒకే వ్యక్తి పలు బాధ్యతలు చేపట్టడం ఈ సినిమా నిర్మాణంలో ప్రత్యేక అంశంగా చెప్పుకోవచ్చు. సైన్స్ ఫిక్షన్ కథాంశాన్ని యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో కలిపి తెరకెక్కించడం ద్వారా విభిన్నమైన సినిమా అనుభూతిని అందించే ప్రయత్నం చేశారు. కథలోని రహస్యాలు, జ్ఞాపకాల మధ్య సంఘర్షణ, ప్రమాదకరమైన వ్యక్తిత్వాలు, తన వాస్తవాన్ని తిరిగి పొందేందుకు ఒక మహిళ చేసే పోరాటం వంటి అంశాలు ఈ చిత్రానికి ప్రధాన నేపథ్యంగా నిలుస్తున్నాయి.

ప్రముఖ తారాగణంతో 'కిల్లర్'

ఈ చిత్రంలో జ్యోతి పూర్వజ్, సుకు పూర్వాజ్ (పూర్వాజ్), మణీష్ గిలాడా, విశాల్ రాజ్, చంద్రకాంత్ కొల్లు, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి తదితరులు నటించారు. విభిన్న పాత్రలతో కూడిన ఈ తారాగణం కథకు బలాన్ని చేకూర్చేలా రూపొందినట్లు చిత్ర వివరాలు తెలియజేస్తున్నాయి. సినిమా నిడివి 1 గంట 56 నిమిషాలు కాగా, సెన్సార్ సర్టిఫికేషన్ ప్రకారం ఖా 16o రేటింగ్ పొందింది. సైన్స్ ఫిక్షన్, యాక్షన్, థ్రిల్లర్ జానర్లలో రూపొందిన ఈ చిత్రం కొత్త తరహా కథలను ఇష్టపడే ప్రేక్షకులకు ఆసక్తికరంగా ఉండే అవకాశం ఉంది.

కొత్త కథాంశాలు.. కొత్త ప్రతిభకు అవకాశాలు

ప్రస్తుతం తెలుగు సినిమా రంగంలో కొత్త కథలు, విభిన్నమైన పాత్రలు, సాంకేతిక ప్రయోగాలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఇలాంటి సమయంలో 'కిల్లర్' వంటి సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ చిత్రాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నాయి. ముఖ్యంగా పలు పాత్రల్లో హీరోయిన్ నటన, అక్కాతమ్ముడి అనుబంధం, తమ్ముడి పాత్రలో మిస్టర్ చందు అభినయం ఈ చిత్రంలోని ప్రత్యేక అంశాలుగా నిలుస్తున్నాయి. పల్లెటూరి నుంచి వచ్చి మీడియా రంగంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, ఇప్పుడు సినిమా రంగంలోనూ తన ప్రతిభను చాటుకుంటున్న మిస్టర్ చందు మరిన్ని మంచి అవకాశాలు అందుకోవాలని ఆకాంక్షిద్దాం. 'కిల్లర్' చిత్రం ఆయన కెరీర్‌లో మరో ముఖ్యమైన అడుగుగా నిలవాలని, చిత్ర బృందానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆశిద్దాం.

సేవాభావం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యం

- **ఇతరులకు ఉపయోగపడేలా మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి**
- **నాయకత్వమంటే పదవి కాదు.. ఎంతమందికి సేవ చేయగలమన్నదే ముఖ్యం**
- **భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల అభివృద్ధికి సింగరేణి నుంచి రూ.2.5 కోట్ల సాయం**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30: విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావం, నాయకత్వ లక్షణాలతో పాటు నైతిక విలువలను పెంపొందించడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. జీవితంలో వ్యక్తిగత విజయాలు సాధించడంతోపాటు ఇతరులకు ఉపయోగ పడేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నాయకత్వమంటే ఎంతమంది మనకు సేవ చేస్తున్నారనేది కాదని, మనం ఎంతమందికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామనేదే అసలైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. దోమలగూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ నవీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల తో కలిసి హాజరైన ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ నినాదమైన 'ఎప్పుడూ సిద్ధంగా ఉండండి' అనే రెండు పదాల వెనుక గొప్ప జీవిత తత్వం దాగి ఉందన్నారు. పరీక్షలు, ఉద్యోగాలు, పదోన్నతులు, వ్యక్తిగత విజయాల కోసం సిద్ధమవడం కంటే కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉండటమే గొప్ప లక్షణమని చెప్పారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు, సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు అందిస్తున్నాయని, అయితే మనం ఎలాంటి మనుషులుగా ఎదగాలనే ప్రశ్నకు మాత్రం సాంకేతికత సమాధానం చెప్పలేదన్నారు. విద్య జ్ఞానాన్ని అందిస్తే, శీలం ఆ జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునే అర్హతను కల్పిస్తుందని పేర్కొన్నారు. నాయకత్వంతోపాటు ఇతరులను అనుసరించడం, పోటీపడటంతోపాటు సహకరించడం, స్వతంత్రంగా ఉంటూనే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడం స్కౌట్స్ అండ్ గైడ్స్ నేర్పించే గొప్ప పాఠాలని వివరించారు. మహాత్మా గాంధీ పదవులు, అధికారంతో కాకుండా తన ఆచరణ, వ్యక్తిత్వం ద్వారా లక్షలాది మందికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. దేశానికి అవసరమైన నాయకత్వం కూడా అలాంటిదేనని అన్నారు.

70 వేల మందికి చేరువైన స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం

గవర్నర్ మార్గదర్శకత్వంలో తెలంగాణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఏడాది కాలంలో సభ్యుల సంఖ్య దాదాపు 70 వేల స్థాయికి చేరిందని చెప్పారు. ఈ కార్యక్రమాలను 3,200కు పైగా ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించి, సుమారు 1.3 లక్షల మంది విద్యార్థులకు చేరువ చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. విద్యార్థులు మరింత ధైర్యవంతులు, దయగలవారు, బాధ్యతాయుతమైన పౌరులుగా

ఎదగడమే ఈ ఉద్యమం సాధించిన అసలైన విజయమని పేర్కొన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.2.5 కోట్లు అందించడం అభినందనీయమని అన్నారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును వెలికితీసే సింగరేణి సంస్థ, ఇప్పుడు పిల్లల్లోని ప్రతిభను వెలికితీసి వారి భవిష్యత్తును ప్రకాశవంతం చేసేందుకు తోడ్పడటం సంతోషకరమని పేర్కొన్నారు. తరగతి గదులు, క్రీడా సౌకర్యాలు, కంప్యూటర్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధితో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. స్కౌట్ లేదా గైడ్‌గా ఉండటానికి అసలైన పరీక్ష యూనిఫాం ధరించడం కాదని, ఎవరూ చూడనప్పుడు కూడా ఆ సంస్థ విలువలు, నియమాలను ఎంత నిబద్ధతతో పాటిస్తున్నామన్నదే ముఖ్యమని విద్యార్థులకు హితవు పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సమాజ సేవ, విద్యా రంగ అభివృద్ధి విషయంలో గవర్నర్ మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తుందని హామీ ఇచ్చారు. గాంధేయ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పాటు పాఠశాలలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

గొంతులో నొప్పి, మంట, గరగర వేధిస్తున్నాయా.. అయితే ఈ వంటింటి చిట్కా మీ కోసమే..!

గొంతులో సమస్య చాలా చిరాకు తెప్పిస్తుంది. ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమయంలో ఈ సమస్య ఎదురవుతూనే ఉంటుంది. గొంతులో గరగర (Throat Itching), భరించలేని గొంతు నొప్పి (Throat Pain), గొంతులో మంట లాంటి సమస్యలు మనలను కుదురుగా ఉండనివ్వవు. ఈ గొంతు సంబంధ బాధను మాటల్లో వర్ణించలేం. ఏది తిన్నా రుచించదు. గొంతు నొప్పిగా ఉన్నప్పుడైతే మంచినీళు మింగబోయినా ప్రాణం పోయినంత బాధ కలుగుతుంది. కొంతమందికి చల్లటి నీళ్లు తాగినప్పుడు లేదంటే ఏదైనా చల్లటి పదార్థం తిన్నప్పుడు గొంతు సమస్యలు వస్తాయి. కొందరికి చల్లటి పదార్థాలతో పెద్దగా సమస్యలు రాకపోయినా పానీపూరి, బజ్జీలు, మిర్చీలు లాంటి బయటి ఫుడ్స్ తిన్నప్పుడు గొంతులో ఇన్‌ఫెక్షన్ వస్తుంది. ఇలా గొంతుకు సంబంధించిన ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే ఉపశమనం కలిగించే వంటింటి చిట్కా ఒకటి ఉంది. మరి ఆ చిట్కా ఏంటో తెలుసుకుందామా..?

ఇదిగో చిట్కా

గొంతులో సమస్య ఉన్నప్పుడు ఒక పాత్రలో పావు లీటర్ నీళ్లు పోసి దాన్ని పొయ్యిమీద పెట్టాలి. ఆ నీళ్లలో చిన్న అల్లం ముక్క, రెండు యాలకులు, ఓ పదీ పన్నెండు తులసి ఆకులు, పావు స్పూన్ పసుపు వేసి బాగా మరిగించాలి. ఆ మరిగించిన నీటిని వడకట్టి తీయడం కోసం ఒక స్పూన్ తేనె కలుపుకుని తాగాలి. అయితే.. మధుమేహం ఉన్నవాళ్లు మాత్రం తేనెను కలుపకపోయినా పర్వాలేదు. ఈ చిట్కా గనుక పాటిస్తే క్షణాల్లోనే మీ సమస్య పరిష్కారమవుతుంది. తక్షణమే ఉపశమనం లభిస్తుంది.

రవీంద్రభారతిలో జిల్లా బృందం స్టిక్ ఆఫీసర్ లఘు నాటక ప్రదర్శన...

హైదరాబాద్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : రాష్ట్ర ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సచివాలయ అసోసియేషన్ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో నాగర్ కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి గోరటి చెన్నకేశవులు జూనియర్ అసిస్టెంట్ మరియు ఇతర శాఖల వారితో కలిసి స్ట్రిక్ట్ ఆఫీసర్ లఘు నాటికను కన్నుల విందుగా ప్రదర్శించారు. అనంతరం నిర్వాకులు కళాబృంద సభ్యులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాబృంద సభ్యులు చెన్నకేశవులు,వివిధ శాఖల బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముత్తమ్మ మృతి బాధాకరం

- **గోనబోయినపల్లిలో బీ=ూ నేత పరామర్శ**
- **మృతురాలి కుటుంబానికి అండగా**
- **5వేల ఆర్థిక సాయం అందజేసిన భీల్యా నాయక్**

డిండి, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య: డిండి మండలం గోనబోయినపల్లి గ్రామానికి చెందిన ముత్తమ్మ మృతి చెందడం చాలా బాధాకరమని BRS పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ అన్నారు. బుధవారం గ్రామానికి చేరుకుని ముత్తమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా 5,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీను, మాధవ, పల్లా లోహిత్ రెడ్డి, PSCS మాజీ వైస్ చైర్మన్ మల్లయ్య, రమణయ్య, శ్రీశైలం, కేతావత్ హరిలాల్ నాయక్, మాజీ సర్పంచ్ ఇద్దయ్య, వార్డు సభ్యులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1న ఉచిత బిపి,షుగర్ వ్యాధి నిర్ధారణ శిబిరం....

నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లా కేంద్రంలోని శ్రీ మణికంఠ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో జిల్లాలోని బీపీ మరియు షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ, ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు డాక్టర్ మణికంఠ జగదీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శరీరంలోని రక్తపోటును మరియు రక్తంలో చక్కెర స్థాయి లను ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆయన అన్నారు. బీపీ మరియు షుగర్ వ్యాధిగ్రస్తులు నవంబర్ 1న ఆదివారం నాడు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు పరిగడుపున, మరియు అల్పాహారం సేవించిన తదుపరి మూత్ర రక్తపరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. వ్యాధిగ్రస్తులు , అనుమానితులు ఆదివారం నాడు జరిగే శిబిరానికి వివరాలకు 9885880155, 9885880166లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మితిమీరిన గర్వం- పతనం

ఒక అడవిలో సింహం తనే అందరికంటే బలవంతుడినని చాలా గర్వంగా తిరిగేది. అది చిన్న జంతువులను చూసి ఎప్పుడూ హేళన చేసేది. ఒకరోజు సింహం గుహ ముందు ప్రశాంతంగా కూర్చుని ఉండగా, ఒక చిన్న దోమ దాని చెవి దగ్గరకు వచ్చి భౌ భౌ అంటూ శబ్దం చేయసాగింది. సింహానికి చాలా కోపం వచ్చి, "ఓయ్ చిన్న దోమ! నా లాంటి అడవి రాజు దగ్గరకు వచ్చి ఎంత ధైర్యంగా శబ్దం చేస్తున్నావు? ఇక్కడి నుంచి వెళ్ళిపో, లేకపోతే నా ఒక్క పంజాతో నిన్ను నలిపేస్తాను" అని గర్జించింది. దానికి ఆ దోమ నవ్వుతూ, "నువ్వు అడవి రాజువైతే నాకేంటి? నేను నీకు అస్సలు భయపడను. నీకంటే నేనే ఎక్కువ బలవంతురాలిని. కావాలంటే నాతో యుద్ధానికి రా!" అని సవాల్ విసిరింది. సింహం కోపంతో ఊగిపోతూ దోమను పట్టుకోవడానికి ప్రయత్నించింది. కానీ దోమ చాలా వేగంగా ఎగురుతూ సింహం ముక్కు మీద, కళ్ల మీద, చెవుల మీద కుట్టడం ప్రారంభించింది. సింహం ఆ దోమను చంపడానికి తన పంజాతో తన ముఖంపైనే గట్టిగా గీరుకుంది. దీనివల్ల దోమకు ఏమీ కాలేదు కానీ, సింహం ముఖం నుండి మాత్రం రక్తం కారడం మొదలైంది. దోమ కాటుకు,తన సొంత గాయాలకు తట్టుకోలేక సింహం చివరకు ఓటమిని అంగీకరిస్తూ, "నన్ను క్షమించు, నువ్వే గెలిచావు" అంది.

నీతి: ఒక చిన్న విజయం దక్కగానే మితిమీరిన గర్వం ప్రదర్శించకూడదు. గర్వం ఎప్పటికైనా పతనానికి దారితీస్తుంది.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

యువ విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం వ్యోమగామి శాస్త్రంలో శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణలో

ప్రతిష్టాత్మక 'గ్లోబల్ స్పేస్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్' ప్రారంభం

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30: సోమాజిగూడ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విజయవాడలోని మారిస్ స్టెల్లా కళాశాలలో 1,000 మంది విద్యార్థులకు విజయవంతంగా శిక్షణ ఇచ్చిన అనంతరం, ఈ అంతర్జాతీయ కార్యక్రమం తెలంగాణలోని పాఠశాలలన్నింటికీ విస్తరిస్తోంది పాఠశాల విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, నూతన ఆవిష్కరణలు, అంతరిక్ష నాయకత్వాన్ని పెంపొందించేందుకు, అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన గ్లోబల్ స్పేస్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ తెలంగాణలో అధికారికంగా ప్రారంభించబడింది. హైదరాబాద్‌లోని సోమాజి గూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో,6 నుండి 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన వ్యోమయానం,అంతరిక్ష విజ్ఞానం, ఆచరణాత్మక సాంకేతిక శిక్షణను ప్రారంభిస్తున్నట్లు సంస్థాగత నాయకత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని యునైటెడ్ పీస్‌కీపర్స్ ఫెడరల్ కౌన్సిల్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ విన్‌బాల్ ఇంటిగ్రేటెడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. బ్లూ క్రాస్ బ్లూ క్రెసెంట్ ఉద్యమం హిమాలయ స్పేస్ సెంటర్‌కు చెందిన నిపుణులు ప్రత్యేక సాంకేతిక పాఠ్యప్రణాళిక శిక్షణను అందిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైన ఉదాహరణ

ఈ కార్యక్రమం యొక్క నిరూపితమైన ప్రభావాన్ని హైలైట్ చేస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలోని మారిస్ స్టెల్లా కళాశాలలో నిన్న దాదాపు 1,000 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం విజయవంతంగా శిక్షణను ముగించిందని నిర్వాహకులు ప్రకటించారు. ఈ సమగ్ర శిక్షణా కార్యక్రమంలో యువ అభ్యాసకులకు ప్రాథమిక ఏరోస్పేస్ మాడ్యూల్స్, అంతరిక్ష అన్వేషణకు అవసరమైన శారీరక మానసిక క్రమశిక్షణ, ఇంటరాక్టివ్ ప్రదర్శనలు పరిచయం చేయబడ్డాయి. ఇది అధ్యాపకులు పాల్గొనేవారి నుండి విస్తృత ప్రశంసలను అందుకుంది.

కార్యక్రమం యొక్క ముఖ్య ముఖ్యాంశాలు

ప్రాథమిక వ్యోమగామి శిక్షణ: రాకెట్ మెకానిక్స్, ఉపగ్రహ ఉన్నాయి.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు ల్యాబ్ టెక్నీషియన్ల సంఘీభావం

- **న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలి**

ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నాయకులు

నాగర్‌కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో గత 18 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు నాగర్‌కర్నూల్ జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం అధ్యక్షుడు కళ్యాణ్ కృష్ణారావు, అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం అధ్యక్షుడు కళ్యాణ్ కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. ముఖ్యంగా కోవిడ్-19 వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలందించిన ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరాటానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత కల్పించడం, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం వంటి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 18 రోజులుగా శాంతియుతంగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నిరంతర ఆరోగ్య సేవలందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేయాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి జీవితాల్లో భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం జరిగే వరకు ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. వివిధ ఉద్యోగ సంఘాలు తమకు సంఘీభావం తెలపడం ఉద్యమానికి మరింత బలాన్ని ఇస్తోందని పేర్కొంటూ ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం నాయకులకు, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌస్ పాషా, ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ జగన్, హైమవతి, ప్రవీణ్ కుమార్, రామకృష్ణారెడ్డి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై మైక్రోస్కోపిక్ పునఃచరణ శిక్షణ

ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజశేఖర్

నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : మైక్రోస్కోప్ ద్వారా మలేరియా సూక్ష్మ క్రిమిని గుర్తించడంపై నాగర్ కర్నూల్ జిల్లాలోని జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్‌కు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించినట్టు ప్రోగ్రాం అదిగారు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. తేదీ 30/10/2026 శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ల్యాబ్ టెక్నీషియన్‌లకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ అనుమానిత రోగియొక్క రక్త నమూనాలను మైక్రోస్కోప్ ద్వారా పరీక్షించడం ద్వారా వంద శాతం కచ్చితంగా మలేరియా సూక్ష్మ క్రిమి ప్లాస్మోడియంను గుర్తించగలమని తెలిపారు. మలేరియా సూక్ష్మక్రిమిలో రకాలైన ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సిఫారంకు కల విభేదాలను ఏ విధంగా కచ్చితంగా గుర్తించడంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవికుమార్, కల్యాణ్ కృష్ణ,వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో BRS పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి

- **నాగర్ కర్నూల్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన**

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



నాగర్ కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : మున్సిపాలిటీ: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నివాసంలో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో సమన్వయంతో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నియోజకవర్గం లోని ప్రతి గ్రామం, ప్రతి మండలంలో పట్టభద్రుల వివరాలను గ్రామాల వారీగా సేకరిస్తూ, అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ ఓటరు నమోదును స్వయంగా చేయించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపిస్తున్న చొరవ, అంకితభావం పార్టీ పట్ల వారికున్న నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు అత్యంత కీలకమైన ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేవలం ఓటరు నమోదు చేయడమే కాకుండా, నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటర్లను సమీకరించడంలో, వారిని ఓటరుగా నమోదు చేయించడంలో మర్రి జనార్దన్ రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశంసించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణుల సమష్టి కృషితో విజయాన్ని సాధించేందుకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సచివాలయంలో ఈరోజు (ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్స్) బృందం ఆధ్వర్యంలో ఎకో టీమ్ బి. మరియ దాసు నాయకత్వంలో వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషనల్ మాక్ డ్రిల్ నిర్వహించింది

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30 : తెలంగాణ సచివాలయంలో ఈరోజు (ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్స్) బృందం ఆధ్వర్యంలో, ఎకో టీమ్ బి. మరియ దాసు నాయకత్వంలో వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషనల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ పోలీస్, అగ్నిమాపక శాఖ, తెలంగాణ స్పెషల్ పోలీస్ ఫోర్స్ ట్రాఫిక్ పోలీస్, వైద్య బృందం, బాంబ్ డిస్పోజల్ బృందాలు సమన్వయంతో పాల్గొన్నాయి. సచివాలయంలో ఏవైనా అనుకోని భద్రతాపరమైన ముప్పులు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ భద్రతా, అత్యవసర సేవల విభాగాల సన్నద్ధత, పరస్పర సమన్వయం, స్పందనా సామర్థ్యం, కార్యాచరణ సామర్థ్యాలను అంచనా వేయడం, మరింత బలోపేతం చేయడం ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యం. ఈ విన్యాసంలో వివిధ శాఖలు, విభాగాలకు చెందిన మొత్తం 130 మంది సిబ్బంది పాల్గొన్నారు.

వారి విభాగాల వారీగా బందోబస్తు వివరాలు: బృందం - 45 మంది, బృందం- 18 మంది, అగ్నిమాపక శాఖ- 08 మంది, లా అండ్ ఆర్డర్ పోలీస్- 10 మంది, తెలంగాణ స్పెషల్ పోలీస్ ఫోర్స్ - 36 మంది, ట్రాఫిక్ పోలీస్- 10 మంది, వైద్య బృందం- 06 మంది, బాంబ్ డిస్పోజల్ బృందం మరియు అసాల్ట్ డాగ్- 04 మందిమొత్తం: 130 మంది సిబ్బంది. ఈ విన్యాసంలో అడిషనల్ ఎస్పీ (అసాల్ట్ కమాండర్) రఘునందన్ రావు, సచివాలయం పి. దేవిదాస్, సచివాలయం శంకర్, డీఎస్పీ రామకృష్ణ, ట్రాఫిక్ మోహన్ రావు, అసిస్టెంట్ కమాండెంట్లు పవన్ కుమార్, సత్తయ్య పాల్గొన్నారు. భద్రతాపరమైన సన్నద్ధతను మరింత పెంపొందించడం, వివిధ సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా సమయాన్ని తగ్గించడం, క్లిష్ట పరిస్థితుల్లో విధుల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడం లక్ష్యంగా బృందం ఇలాంటి ఆపరేషనల్ విన్యాసాలు, మాక్ డ్రిల్స్ ను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఈ మాక్ డ్రిల్ ద్వారా తెలంగాణ సచివాలయం భద్రతను పటిష్టంగా నిర్వహించేందుకు, అన్ని అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పాల్గొన్న అన్ని శాఖలు తమ నిబద్ధతను మరోసారి చాటుకున్నాయి. సచివాలయ భద్రత, రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉంటాయని ఈ విన్యాసం స్పష్టం చేసింది.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- **ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ఆలేరు, అక్టోబరు 30: మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని యాదాద్రి-భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం ఆలేరు మండలం గుండ్లగూడెంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సంఘం సమావేశం, మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు తమ నైపుణ్యాలు, ఆసక్తులకు అనుగుణంగా కుట్టుపని, కిరాణా దుకాణాలు, కంప్యూటర్ కేంద్రాలు, డ్రోన్ సేవలు, వ్యవసాయ అనుబంధ వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ద్వారా అవసరమైన శిక్షణ అందించి, బ్యాంకు రుణాలు, రాయితీలు పొందేలా మార్గదర్శకత్వం కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏకరూప దుస్తుల తయారీ, క్యాంటీన్ల నిర్వహణ వంటి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు వివరించారు. మహిళలు సంఘాల ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని

ఆర్థికంగా బలోపేతంకావాలని పిలుపునిచ్చారు. మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో కొందరి పరీక్షల నివేదికలు ఆలస్యమైనా, త్వరలోనే అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డీపీఎం ప్రభాకర్, తహసీల్దార్ ఆంజనేయులు,ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఏపీఎం సత్యనారాయణ, సర్పంచి మంజుల, మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత,సీసీలు సరస్వతి,రాణెమ్మ, పంచాయతీ కార్యదర్శి, వీఓఏలు, వీఓ అధ్యక్షులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాత్రి ధనియాలను నానబెట్టి ఉదయాన్నే ఆ నీళ్లు తాగితే ఆరోగ్యానికి ఎంత మేలో తెలుసా..?

వంట గదిలో ఉండే రకరకాల మసాలా దినుసుల్లో ధనియాలు (Coriander Seeds) కూడా ప్రధానమైనవి. దాదాపు అన్ని రకాల వంటకాల్లో ధనియాలను సువాసన కోసం వినియోగిస్తుంటారు. ధనియాల్లోని ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే మన పూర్వీకులు ధనియాలను ఆహారంలో భాగం చేశారు.

ప్రయోజనాలు..

ఆరోగ్య నిపుణులు తెలిపిన ప్రకారం.. బరువు తగ్గాలనుకునే వారికి ఈ ధనియాల నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ధనియాల నీటితో జీవక్రియ మెరుగవుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలకు చెక్ పెట్టొచ్చు. తీసుకున్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. ధనియాల్లో విటమిన్ కె, విటమిన్ సి, విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యానికి ఎంతో మంచిది. ప్రతి రోజు ధనియాలు నానబెట్టిన నీటిని తీసుకుంటే జుట్టు రాలుడు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. దయాబెటిస్ బాధితులకు కూడా ధనియాల నీరు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండేవారు ప్రతి రోజూ ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకుంటే షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. ప్రతిరోజు ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఫ్రీ రాడికల్స్‌కి వ్యతిరేకంగా పోరాడుతాయి. ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తాయి.

చైనీస్ ఫుడ్ వండేటప్పుడు పాత్రలపై మంటలు వస్తాయి.. ఎందుకని..?

మండుతున్న నూడుల్స్ నుంచి మంటలు చెలరేగుతున్నట్లుగా కనిపించే ఫ్రైడ్ రైస్ వరకు.. చైనీస్ రెస్టారెంట్ల వంటగదుల్లో ఆహారం వండేటప్పుడు ఒక్కసారిగా ఎగిసిపడే మంటలను మీరు గమనించే ఉంటారు. వంట చేసే సమయంలో కనిపించే ఈ మంటల వెనుక అధిక వేడి, నూనె, వంట చేసే విధానం వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. చైనీస్ రెస్టారెంట్లలో వంట చేస్తున్నప్పుడు చెఫ్‌లు పెద్ద పెనంలో నూడుల్స్, కూరగాయలు లేదా అన్నాన్ని వేగంగా కలుపుతూ కనిపిస్తారు. అలా కలుపుతున్న సమయంలో ఒక్కసారిగా పెనం చుట్టూ మంటలు ఎగిసిపడతాయి.

కారణమేమిటి..?

దీనికి ప్రధాన కారణం అధిక ఉష్ణోగ్రత, వేడెక్కిన నూనె, శక్తివంతమైన గ్యాస్ పొయ్యిల కలయిక. అనేక రెస్టారెంట్ల వంటగదుల్లో ఉపయోగించే పెద్ద పెనాలు సాధారణంగా మన ఇళ్లలోని పొయ్యిల కంటే చాలా ఎక్కువ ఉష్ణోగ్రతకు వేడెక్కుతాయి. నూనె బాగా వేడెక్కినప్పుడు అందులో కొంత ఆవిరిగా మారడంతో పాటు చిన్న చిన్న నూనె బిందువులుగా విడిపోతుంది.

మంట వల్ల ప్రత్యేక రుచి వస్తుందా..?

మంటల వల్లే ఆ పొగ వాసన, ప్రత్యేకమైన రుచి వస్తాయా? అంటే.. కొంతవరకు అవుననే సమాధానం చెప్పవచ్చు. చైనీస్ వంటకాల్లో కనిపించే కొద్దిగా కాలినట్లుగా ఉండే ప్రత్యేకమైన పొగ వాసన, రుచిని వోక్ హే అని పిలుస్తారు. ఇది కాంటనీస్ భాషకు చెందిన పదం. దీని అర్థం సుమారుగా పెనం శ్వాస అని చెప్పవచ్చు.

ప్రజల సొమ్ము ప్రజలకే దక్కాలి.. అవినీతిపై సమరమే సాగాలి

- **భూదోపిడీదారులపై ఉక్కుపాదం మోపాలి.. గత పదేళ్ల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి**
- **అవినీతి సొమ్మును వెలికితీసి పేదల జీవితాల్లో వెలుగులు నింపాలి.. సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత ధరావత్ రవీంద్ర నాయక్ కీలక విజ్ఞప్తి**

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన : ప్రజలు కష్టపడి సంపాదించిన పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరిన ప్రతి రూపాయి ప్రజల అభివృద్ధికే ఉపయోగపడాలి. ప్రభుత్వ భూములు, ప్రజల ఆస్తులు కొందరి స్వార్థానికి బలికాకుండా కాపాడాలి. పేదల హక్కులను హరించే అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడాలి. ప్రజాధనాన్ని దోచుకున్నా, ప్రభుత్వ భూములను ఆక్రమించినా చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందే. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం మరింత దృఢమైన సంకల్పంతో ముందుకు సాగాలని మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత ధరావత్ రవీంద్ర నాయక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత పదేళ్ల పాలనలో చోటుచేసుకున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, అక్రమాలు, భూదోపిడీ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. అక్రమంగా సంపాదించిన ఆస్తులను, ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను చట్టబద్ధంగా తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని సూచించారు. అవినీతిపై పోరాటం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలని, ప్రజల సంపదను తిరిగి ప్రజలకే అందించే దిశగా ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

పదేళ్ల పాలనపై నిజాలు నిగ్గుతేలాలి

రాష్ట్రంలో గత పదేళ్ల కాలంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, అక్రమాలు, ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం, భూఆక్రమణలపై లోతైన విచారణ జరగాల్సిన అవసరం ఉందని ధరావత్ రవీంద్ర నాయక్ అభిప్రాయపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా సరే ప్రజల ఆస్తులను తమ సొంత ఆస్తులుగా భావించే పరిస్థితి ఉండకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు అనేవి భవిష్యత్ తరాలకు చెందిన సంపద అని, వాటిని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని గుర్తుచేశారు. ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత వ్యవహారాలన్నింటినీ వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులెవరైనా సరే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించి, విచారణలో తేలిన వాస్తవాల ఆధారంగా న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

భూదోపిడీకి అడ్డుకట్ట.. ప్రభుత్వ భూములకు రక్షణ

భూమి అనేది కేవలం ఆస్తి మాత్రమే కాదని, ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన విలువైన

సంపద అని రవీంద్ర నాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే భవిష్యత్తులో పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, ప్రజా అవసరాలకు స్థలాల కొరత ఏర్పడుతుందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వ భూములపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆక్రమణలను గుర్తించి, రెవెన్యూ రికార్డులను పరిశీలించి, చట్టబద్ధమైన చర్యల ద్వారా భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రజల ఆస్తులను కాపాడటంలో ఎలాంటి అలసత్వానికి తావుండ కూడదని, భూదోపిడీకి పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానంపై రాజకీయ వర్గాల్లో చర్చ

బ్రహ్మంగారి కాలజ్ఞానంలోని కొన్ని అంశాలను ప్రస్తుత రాజకీయ పరిణామాలకు అన్వయిస్తూ ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోందని ధరావత్ రవీంద్ర నాయక్ పేర్కొన్నారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో అనేక అంశాలపై ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారని తెలిపారు. అయితే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఊహాగానాల కంటే వాస్తవాలకే ప్రాధాన్యత ఉండాలని, అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై ఆధారాలతో విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుంచాలని అభిప్రాయపడ్డారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం, పాలనలో పారదర్శకతను పెంపొందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి కృషికి అభినందనలు.. మిగిలిన హామీలను నెరవేర్చాలి

తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ధరావత్ రవీంద్ర నాయక్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో సుమారు 60 నుంచి 70 శాతం వరకు అమలయ్యాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మిగిలిన హామీలను కూడా త్వరితగతిన అమలు చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. ముఖ్యంగా పేద కుటుంబాలు, రైతులు, గిరిజనులు, నిరుద్యోగులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాల ఫలాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లినప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని పేర్కొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై చొరవ.. రైతాంగానికి భరోసా

తెలంగాణ రైతాంగానికి సాగునీటి భద్రత కల్పించడం రాష్ట్ర అభివృద్ధిలో అత్యంత కీలకమైన అంశమని రవీంద్ర నాయక్ పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చలు రాష్ట్ర ప్రయోజనాల పట్ల ప్రభుత్వ చొరవను తెలియజేస్తున్నాయని అభినందించారు. రైతు పొలానికి నీరు చేరితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, సాగునీటి సమస్యలు పరిష్కారమైతే రైతుల జీవితాల్లో స్థిరత్వం ఏర్పడుతుందని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, అంతర్రాష్ట్ర సమన్వయంతో తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను కాపాడాలని కోరారు. రైతాంగానికి ఇచ్చే భరోసా కేవలం ప్రకటనల్లో కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాల రూపంలో కనిపించాలని అభిప్రాయపడ్డారు.

అవినీతి సొమ్ము పేదల చదువులకు.. పేదల వైద్యానికి ఉపయోగపడాలి

అవినీతి ద్వారా అక్రమంగా సంపాదించిన ఆస్తులు, డబ్బును చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తిరిగి రికవరీ చేస్తే ఆ సంపదను ప్రజా సంక్షేమానికి వినియోగించే అవకాశం ఉంటుందని ధరావత్ రవీంద్ర నాయక్ సూచించారు. ముఖ్యంగా పేద పిల్లలకు నాణ్యమైన విద్య, నిరుపేదలకు మెరుగైన వైద్యం, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఒకవైపు ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడుతూ, మరోవైపు తిరిగి స్వాధీనం చేసుకున్న ఆస్తులు, నిధులను ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేలా వినియోగించాలని సూచించారు. పేద కుటుంబంలో పుట్టిన విద్యార్థికి ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆగకూడదని, వైద్యం అందక ఏ నిరుపేద కుటుంబం కష్టపడకూడదని, గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండకూడదని ఆయన ఆకాంక్షించారు. ప్రజల సంపద తిరిగి ప్రజల సంక్షేమానికి ఉపయోగపడినప్పుడే పాలనకు నిజమైన అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు.

సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం కావాలి

అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరినప్పుడే ప్రజాస్వామ్య పాలన సార్థకమవుతుందని ధరావత్ రవీంద్ర నాయక్ అభిప్రాయపడ్డారు. పేదలు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలు, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, నిధుల వినియోగంలో జవాబుదారీతనం, ప్రజా ఆస్తుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే పాలనతోపాటు, ప్రజల సంపదను కాపాడే పాలన కూడా అవసరమని పేర్కొన్నారు.

ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి అసలైన బలం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవినీతి, భూదోపిడీ ఆరోపణల విషయంలో ఎలాంటి వెనకడుగు వేయకుండా ముందుకు సాగాలని ధరావత్ రవీంద్ర నాయక్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు మార్పును కోరుకుంటూ ప్రభుత్వానికి అధికారం అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. గతంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై విచారణ జరిపించడం, ప్రజా ఆస్తులను రక్షించడం, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. "అవినీతిపై రాజీ పడొద్దు.. భూదోపిడీపై వెనక్కి తగ్గొద్దు. గత పదేళ్లలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి. ప్రజల సొమ్మును దోచుకున్నవారు ఎవరైనా చట్టం ముందు నిలబడాలి. ఆక్రమిత ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలి. అవినీతి ద్వారా వచ్చిన సొమ్మును చట్టప్రకారం రికవరీ చేసి పేదలు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఉపయోగించాలి. ప్రజల ఆస్తులు ప్రజలకే దక్కేలా చేసి, పేదల జీవితాల్లో వెలుగులు నింపితే ప్రజల హృదయాల్లో ప్రభుత్వం చిరస్థాయిగా నిలిచిపోతుంది" అని సీఎం రేవంత్‌రెడ్డికి ధరావత్ రవీంద్ర నాయక్ విజ్ఞప్తి చేశారు.

సింహం- తెలివైన ఎలుక

ఒక దట్టమైన అడవిలో విక్రమ్ అనే ఒక పెద్ద సింహం నివసించేది. ఒకరోజు ఆ సింహం బాగా వేటాడి, అలసిపోయి ఒక పెద్ద చెట్టు కింద హాయిగా నిద్రపోతోంది. అదే సమయంలో ఆ చెట్టు కింద ఉన్న కలుగులో నుండి చింటూ అనే ఒక చిన్న ఎలుక బయటకు వచ్చింది. అది సరదాగా ఆడుకుంటూ, నిద్రపోతున్న సింహం శరీరంపైకి ఎక్కి అటు ఇటు పరుగులు తీసింది. ఎలుక కాళ్ల గోకడం వల్ల సింహానికి నిద్రభంగం కలిగింది. అది చాలా కోపంతో పెద్దగా గర్జిస్తూ తన భారీ పంజాతో ఎలుకను గట్టిగా పట్టుకుంది. నోరు తెరిచి దాన్ని తినబోయింది. భయంతో వణికిపోతూ చింటూ ఇలా బతిమిలాడింది, "రాజా! నన్ను క్షమించండి. నేను తెలియక తప్పు చేశాను. నన్ను చంపకండి. నా లాంటి చిన్న ప్రాణాన్ని తింటే మీ ఆకలి కూడా తీరదు. దయచేసి నన్ను వదిలేయండి, భవిష్యత్తులో మీ రుణం ఉంచుకోను, ఏదో ఒకరోజు మీకు కచ్చితంగా సహాయం చేస్తాను" అంది. ఎలుక మాటలు విన్న సింహం పెద్దగా నవ్వి, "నువ్వంత చిన్నదానివి, నాకెలా సహాయం చేస్తావు? సరేలే, జాలి చూపి వదిలేస్తున్నా" అని వదిలేసింది. కొన్ని రోజుల తర్వాత, ఒక వేటగాడు అడవికి వచ్చి సింహాన్ని పట్టుకోవడానికి ఒక పెద్ద వల వేశాడు. విక్రమ్ అనుకోకుండా ఆ వలలో చిక్కుకుపోయింది. వల నుండి బయటకు రాలేక సింహం గట్టిగా గర్జించసాగింది. ఆ గర్జన విన్న చింటూ, వెంటనే సింహం ఆపదలో ఉందని గ్రహించి అక్కడికి పరుగున వచ్చింది. తన పదునైన పళ్లతో వల తాళ్లను చకచకా కొరికేసింది. అలా సింహం వల నుండి విముక్తి పొందింది. ఆ రోజు నుండి సింహం, ఎలుక మంచి స్నేహితులయ్యాయి. తన పదునైన పళ్లతో వల తాళ్లను చకచకా కొరికేసింది. అలా సింహం వల నుండి విముక్తి పొందింది. ఆ రోజు నుండి సింహం, ఎలుక మంచి స్నేహితులయ్యాయి.

నీతి: ఎవరినీ తక్కువ అంచనా వేయకూడదు. చిన్నవారైనా సరే సమయం వచ్చినప్పుడు పెద్ద సహాయం చేయగలరు.

జర్మనీతో తెలంగాణ బంధం మరింత బలోపేతం కావాలి

అంతర్జాతీయ పెట్టుబడులు, పర్యాటకం, సాంకేతిక రంగాల్లో అపార అవకాశాలు

జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 30: భారత్, జర్మనీ దేశాల మధ్య 75 ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని రాష్ట్ర క్రీడా , యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌కు, జర్మనీ ప్రభుత్వానికి, ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యత, పరస్పర అవగాహన, ఉమ్మడి భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలనే సందేశాన్ని జర్మన్ ఐక్యతా దినోత్సవం ప్రపంచానికి అందిస్తోందన్నారు. భారత్‌కు జర్మనీ ముఖ్యమైన ఆర్థిక భాగస్వామ్య దేశమని, ఇంజినీరింగ్, ఆటోమొబైల్ తయారీ, ఐటీ, పరిశోధన, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య మంచి సహకారం కొనసాగుతోందన్నారు. 2024లో ఇరు దేశాల మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 50 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటిందని పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన సాంకేతిక వ్యవస్థలతో హైదరాబాద్ అంతర్జాతీయ కంపెనీలకు ప్రధాన గమ్యస్థానంగా ఎదిగిందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో డాయిష్ బోర్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం అంతర్జాతీయ సంస్థలకు నగరంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాలను పెంపొందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. అధునాతన తయారీ,ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఐటీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీ కంపెనీలను తెలంగాణకు ఆహ్వానించారు. జర్మనీలోని థ్యూరింగియా రాష్ట్రంతో నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సహకారం పెరుగుతోందని వివరించారు.

తెలంగాణ సంస్కృతి, పర్యాటకానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు

తెలంగాణకు గొప్ప చరిత్ర, విశిష్టమైన సాంస్కృతిక వారసత్వం ఉందని మంత్రి పేర్కొన్నారు. కాకతీయుల నిర్మాణ వైభవం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, హైదరాబాద్ చారిత్రక కట్టడాలు రాష్ట్ర పర్యాటక ప్రత్యేకతను చాటుతున్నాయన్నారు. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు, చేనేత, హస్తకళలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని చెప్పారు. హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని, జర్మనీతో వంటకాల

పండుగలు, చెఫ్‌ల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సాంస్కృతిక సంబంధాలను మరింత పెంపొందించ వచ్చన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్ కాకతీయ వారసత్వ సంపద, రామప్ప దేవాలయం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, సరస్సులు, జలపాతాలు, అటవీ ప్రాంతాలు, సంప్రదాయ గ్రామాలను సందర్శించాలని జర్మనీ పర్యాటకులకు మంత్రి ఆహ్వానం పలికారు.

50 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యం

తెలంగాణను దేశంలోని ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030 ద్వారా ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, ఐదు లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పాలసీ తొలి సంవత్సరంలోనే 22,174 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హోటళ్లు, రిసార్టులు, వారసత్వ పర్యాటకం, పర్యావరణ పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, ఆతిథ్య రంగ విద్యలో పెట్టుబడులు పెట్టాలని జర్మనీ సంస్థలకు పిలుపునిచ్చారు. భారత్-జర్మనీ మధ్య 75 ఏళ్ల స్నేహబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తూ, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత దృఢపరుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

నిజాయితీకి దక్కిన బహుమతి

పూర్వం ఒక చిన్న గ్రామంలో సోము అనే ఒక పేద కట్టెలు కొట్టేవాడు ఉండేది. అతడు చాలా నిజాయితీపరుడు. ప్రతిరోజూ అడవికి వెళ్లి ఎండిపోయిన చెట్ల కొమ్మలను కొట్టి, వాటిని బజార్లో అమ్మి వచ్చిన కొద్దిపాటి డబ్బుతో తన కుటుంబాన్ని పోషించేవాడు. ఒకరోజు సోము ఒక పెద్ద నది ఒడ్డున ఉన్న చెట్టు కొమ్మలను నరుకుతున్నాడు. పొరపాటున అతని చేతిలో ఉన్న ఇనుప గొడ్డలి జారి లోతైన నది నీటిలో పడిపోయింది. ఆ గొడ్డలి తప్ప అతని దగ్గర వేరే ఏ ఆధారం లేదు. దాంతో సోము నది ఒడ్డున కూర్చుని, "అయ్యో దేవుడా! ఇప్పుడు నా కుటుంబం ఎలా బతుకుతుంది?" అని ఏడవసాగాడు. అతని నిజాయితీని పరీక్షించడానికి ఆ నది నుండి వనదేవత ప్రత్యక్షమైంది. దేవత సోమును చూసి,"ఎందుకు ఏడుస్తున్నావు నాయనా?" అని అడిగింది.సోము జరిగిందంతా చెప్పాడు. దేవత వెంటనే నీటిలోకి వెళ్లి ఒక బంగారు గొడ్డలిని బయటకు తీసి, "ఇది నీదేనా?" అని అడిగింది. సోము దాన్ని చూసి, "కాదు దేవి, ఇది నాది కాదు" అన్నాడు. దేవత మళ్లీ నీటిలోకి వెళ్లి ఈసారి ఒక వెండి గొడ్డలిని తీసి చూపించింది. సోము దానికి కూడా, "ఇది కూడా నాది కాదు తల్లీ, నాది సాధారణ ఇనుప గొడ్డలి" అని చెప్పాడు. సోము నిజాయితీకి దేవత చాలా సంతోషించింది. మూడోసారి నీటిలోకి వెళ్లి అతని ఇనుప గొడ్డలిని తీసి ఇచ్చింది. దాన్ని చూడగానే సోము ఆనందంతో, "అవును, ఇదే నా గొడ్డలి!" అన్నాడు. సోము యొక్క నిష్కల్మషమైన నిజాయితీకి మెచ్చిన వనదేవత, ఆ ఇనుప గొడ్డలితో పాటు బంగారు, వెండి గొడ్డళ్లను కూడా అతనికి బహుమతిగా ఇచ్చేసింది. సోము ఆనందంగా ఇంటికి వెళ్లి సుఖంగా జీవించాడు.

నీతి: నిజాయితీ ఎప్పుడూ వృధా పోదు. కష్టకాలంలో కూడా నిజాయితీగా ఉంటే దానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా లభిస్తుంది.

కాయకష్టమే నిజమైన సంపద



ఒక అందమైన గ్రామంలో కృష్ణయ్య అనే ఒక ముసలి రైతు ఉండేవాడు. అతనికి నలుగురు కొడుకులు. ఆ నలుగురు కొడుకులు చాలా సోమరిపోతులు. తండ్రి పగలనక రేయనక పొలంలో కష్టపడుతుంటే, కొడుకులు మాత్రం ఊళ్లో తిరుగుతూ కాలక్షేపం చేసేవారు. కృష్ణయ్య వారికి ఎంత చెప్పినా వినేవారు కాదు. వయసు పైబడటంతో రైతుకు జబ్బు చేసింది. తాను చనిపోతే తన కొడుకులు ఎలా బతుకుతారో అని అతను చాలా ఆందోళన చెందాడు. వారిని దారిలోకి తెచ్చేందుకు ఒక చక్కని ఉపాయం ఆలోచించాడు.ఒకరోజు రైతు నలుగురు కొడుకులను తన మంచం దగ్గరకు పిలిచి ఇలా అన్నాడు,"నాన్నలారా! నా ప్రాణాలు పోయే సమయం దగ్గర పడింది. మీకోసం మన పొలంలో ఒక చోట పెద్ద నిధిని (బంగారు నాణేల కడవను)దాచిపెట్టాను.నేను చనిపోయిన తర్వాత మీరు పొలాన్ని తవ్వి ఆ నిధిని తీసుకోండి" అని చెప్పి కన్నుమూశాడు.తండ్రి అంత్యక్రియలు ముగిసిన తర్వాత, కొడుకులకు ఆ నిధిపై ఆశ పుట్టింది. నలుగురూ కలిసి పొలానికి వెళ్లారు. నిధి ఎక్కడుందో తెలియకపోవడంతో,పొలం మొత్తాన్ని అంగుళం అంగుళం వదలకుండా లోతుగా తవ్వేశారు. కానీ ఎంత వెతికినా ఎక్కడా నిధి దొరకలేదు. దాంతో వారు తీవ్ర నిరాశతో ఇంటికి తిరిగి రాసాగారు. అప్పుడు ఆ దారిలో వెళ్తున్న ఒక వృద్ధ రైతు వారిని చూసి, "నాయనలారా! ఎలాగూ పొలాన్ని అంత బాగా తవ్వారు కదా, ఇప్పుడు వర్షాలు పడే సమయం వచ్చింది.

వాతావరణ మార్పులతోనే యూరప్‌లో ఎండలు.. 50వేల మరణాలకు అవే కారణం..

యూరప్‌లో ఈ ఏడాది వేసవిలో నమోదైన రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు 50,391 మంది ప్రాణాలను బలిగొన్నాయి. వీరిలో 32,619 మంది మరణాలకు మానవ కార్యకలాపాల వల్ల పెరిగిన వాతావరణ మార్పులే కారణమని తాజాఅధ్యయనం వెల్లడించింది.బొగ్గు,చమురు, సహజ వాయువుల వినియోగం కారణంగా పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రాణాంతకంగా మారుతోందని పరిశోధకులు హెచ్చరించారు.



50వేల మంది మృత్యువాత..

యూరప్‌లో ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా సంభవించిన తీవ్రమైన వడగాలుల కారణంగా 50,391 మంది మరణించినట్లు నేచర్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితం అయిన అధ్యయనం వెల్లడించింది. యూరప్‌లోని 854 నగరాల్లో వివిధ వయసుల వారిపై ఉష్ణోగ్రతల ప్రభావాన్ని పరిశోధకులు విశ్లేషించారు. మొత్తం మరణాల్లో 32,619 మంది మానవ చర్యల కారణంగా పెరిగిన అదనపు వేడి ప్రభావంతోనే ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. 2022లో నమోదైన అత్యధిక వేసవి మరణాల సంఖ్య 29,480తో పోలిస్తే ఈ ఏడాది మరణాలు 71 శాతం ఎక్కువ. మే నెలలో సంభవించిన ప్రాణాంతక వడగాలులను, అధ్యయనంలో పరిశీలించిన 854 నగరాలకు వెలుపల జరిగిన మరణాలను లెక్కలోకి తీసుకోకపోవడంతో వాస్తవ మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు.

కరువు పరిస్థితులపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి

- **నాగర్ కర్నూల్ జిల్లాలో 13 మండలాలు కరువు ప్రాంతాలుగా గుర్తింపు**
- **గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లాలోని 13 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించిందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజలకు వ్యవసాయ, ఉద్యాన శాఖల పంటల నష్ట సేకరణతో పాటు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించి పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ, ఉద్యానవన, మిషన్ భగీరథ, నీటిపారుదల, భూగర్భ జల, డీఆర్డీఏ, పంచాయతీరాజ్ తదితర శాఖల జిల్లా అధికారులతో కరువు మండలాల్లో చేపట్టవలసిన చర్యలు నివేదికలు ప్రణాళికలపై అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం తో కలిసి జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....., జిల్లాలో కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా శాఖల వారీగా పూర్తి స్థాయి నివేదికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కరువు ప్రభావాన్ని అంచనా వేయడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అందుబాటులో ఉన్న గణాంకాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, సంబంధిత శాఖల రికార్డుల ఆధారంగా స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఉర్కొండ, వెల్దండ, కల్వకుర్తి, వంగూరు, చారకొండ, అమ్రాబాద్, పదరా, అచ్చంపేట, బల్మూరు, లింగాల, పెద్దకొత్తపల్లి, కోడేరు, బిజినేపల్లి మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించిందని తెలిపారు. ఈ మండలాల్లో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి వనరులు, బోరుబావులు, చేతిపంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి సరఫరా పైపులైన్ల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. 15 రోజులకు ఒకసారి విధిగా నీటి సరఫరా పై పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే సమస్యను గుర్తించి పరిష్కరించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, భూగర్భ జల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామంలో తాగునీటి లభ్యతపై నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజల నుంచి తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు కరువు పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేస్తూ రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. పంటల పరిస్థితి, సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత నివేదికలను సమర్పించాలని సూచించారు. జిల్లాలో కరువు పరిస్థితులపై రూపొందించే నివేదికలో అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సమన్వయంతో పొందుపరచాలని, శాఖల వారీగా సమర్పించే గణాంకాలు పరస్పరం సరిపోలేలా పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు, నిర్దేశిత ప్రొఫార్మాలకు అనుగుణంగా నివేదికలను రూపొందించి, నిర్ణీత సమయంలో సమర్పించాలని తెలిపారు. ప్రతి శాఖాధికారి తన శాఖకు సంబంధించిన సమాచారాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి, అవసరమైన ఆధారాలు, గణాంకాలు, క్షేత్రస్థాయి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలని, జిల్లా కరువు నివేదిక సమగ్రంగా, వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే విధంగా ఉండాలని పేర్కొన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు సకాలంలో అవసరమైన సేవలు అందించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలోని గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పాండు, ఆర్డీవోలు అర్చన, బన్సీలాల్, జిల్లా అధికారులు యశ్వంతరావు, చిన్న ఓబులేసు, శ్రీరాములు, సుధాకర్ సింగ్, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ నీట మునిగి వ్యక్తి మృతి

మెదక్ జిల్లా : ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన చెందిన సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయల చెక్ డ్యాంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం. పాపన్నపేట గ్రామానికి చెందిన ఆకుల క్రిష్ణ(30) కూలీ పనులు చేస్తూ జీవితం గడుపుతున్నాడు. గురువారం రాత్రి ఏడుపాయల వద్ద ఉన్న తన తల్లి అంజమ్మ వద్దకు వెళ్లాడని, శుక్రవారం ఉదయం స్నానం చేసేందుకు ఏడుపాయల చెక్ డ్యాం వద్దకు వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి గల్లంతయ్యాడని వివరించారు.

విశాఖ పోర్టులో భారీ అగ్నిప్రమాదం..

విశాఖ పోర్ట్ ట్రస్ట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. సీ హార్స్ జంక్షన్ సమీపంలోని జె.ఎం. భక్షి కంపెనీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న కన్వేయర్ బెల్ట్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఈరోజు (శుక్రవారం) మధ్యాహ్నం 1:45 గంటల సమయంలో మంటలు భారీగా వ్యాపించాయి.భారీగా మంటలు ఎగసిపడటం, దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఫైర్ ఇంజిన్లతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే, ఇప్పటివరకు మంటలు అదుపులోకి రాలేదు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భూటాన్‌లో హిమానీనదం విస్ఫోటనం.. బెంగాల్, అస్సాంలకు వరద ముప్పు..



భూటాన్ దేశంలోని గాసా జిల్లా లో షింటాఫు సరస్సు ఉప్పొంగి వరద సంభవించింది. దాంతో పశ్చిమబెంగాల్, అస్సాంలోని కొన్ని ప్రాంతాలకు ఆకస్మిక వరద హెచ్చరికలు జారీఅయ్యాయి. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనవల్ల గాసా జిల్లాలోని మోచు నది ఒడ్డున ఉన్న ప్రసిద్ధ సహజ వేడినీటి బుగ్గ అయిన గాసా త్సాచులోని సౌకర్యాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. అయితే ముందుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.మోచు నది ప్రారంభంలోనే ఉన్న షింటాఫు సరస్సు భూటాన్‌లోని 17 ప్రమాదకరమైన హిమానీనద సరస్సులలో ఒకటి.

ఐసీఏఆర్-క్రీడాలో ఘనంగా పీఎం-కిసాన్ 24వ విడత ప్రత్యక్ష ప్రసారం

- **రైతు సంక్షేమమే లక్ష్యం.. సాగుకు ఆర్థిక భరోసా!**
- **దేశవ్యాప్తంగా 9.34 కోట్ల మందికి పైగా రైతుల ఖాతాల్లో రూ.18,690 కోట్లకు పైగా జమ**
- **మెట్ట వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతలు, నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగంపై అవగాహన**

మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన: రైతుల ఆర్థిక స్థిరత్వానికి భరోసా కల్పిస్తూ, వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్ (క్రీడా)లో శుక్రవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. గుజరాత్‌లోని బనస్కాంత నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా అక్టోబరు 30ను పీఎం--కిసాన్ ఉత్సవ దినంగా పాటించే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ వెబ్‌కాస్ట్‌లో క్రీడా సిబ్బందితోపాటు గిరిజన ఉపప్రణాళిక పరిధిలోని రైతులు పాల్గొన్నారు. మొత్తం 104 మంది హాజరైన ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమం, వ్యవసాయ సాంకేతికతలు, సుస్థిర సాగు విధానాలపై అవగాహన కల్పించారు.

9.34 కోట్ల మందికి పైగా రైతులకు ఆర్థిక చేయూత

గుజరాత్‌లోని బనస్కాంత నుంచి నిర్వహించిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 9 కోట్ల 34 లక్షల మందికి పైగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.18,690 కోట్లకు పైగా నిధులను ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానంలో జమ చేసినట్లు కార్యక్రమంలో వెల్లడించారు. రైతులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించడం ద్వారా సాగు అవసరాలను తీర్చుకోవడానికి, వ్యవసాయ పెట్టుబడులకు మద్దతు లభిస్తుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం-కిసాన్ పథకం 24వ విడతను విడుదల చేస్తూ వర్చువల్‌గా ప్రసంగించారు. రైతుల ఆర్థిక భద్రత, వ్యవసాయ రంగ పురోగతి, సమ్మిళిత అభివృద్ధికి ప్రభుత్వ కట్టుబాటును ఈ కార్యక్రమం పునరుద్ఘాటించింది.

మెట్ట వ్యవసాయానికి ఆధునిక సాంకేతికతలు

వెబ్‌కాస్ట్‌కు ముందు కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ కె. రవిశంకర్ ప్రారంభోపన్యాసం చేశారు. మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు క్రీడా అభివృద్ధి చేసిన సాంకేతికతలను వివరించారు. ముఖ్యంగా నల్లరేగడి నేలలకు అనువైన విశాలమైన మడుల పద్ధతిలో విత్తే యంత్రం (బీబీఎఫ్ ప్లాంటర్), వ్యవసాయ క్షేత్రాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునే క్షేత్రపు చెరువు సాంకేతికత ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ విధానాల ద్వారా నీటి సంరక్షణ, నేల తేమ నిర్వహణ, పంటల ఉత్పాదకత మెరుగుదలకు అవకాశాలు ఉన్నాయని వివరించారు.

చిన్న, సన్నకారు రైతులకు పీఎం-కిసాన్ భరోసా

క్రీడా డైరెక్టర్ డాక్టర్ వి.కె. సింగ్ మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధికి పీఎం-కిసాన్ పథకం అందిస్తున్న ఆర్థిక మద్దతు ప్రాధాన్యతను వివరించారు. మెట్ట వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడంలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి పోషిస్తున్న పాత్రను ప్రస్తావించారు. రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన సాగు పద్ధతులను ప్రోత్సహించడం, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే పరిశోధనలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం అవసరమని వివరించారు.

నేల ఆరోగ్యమే సుస్థిర వ్యవసాయానికి పునాది

రైతులకు 'సేవ్ ది ఫీల్డ్ క్యాంపెయిన్-2026'పై అవగాహన కల్పించడంతోపాటు నేల పరీక్షల

ఆధారంగా సమతుల్య ఎరువులు వినియోగించాల్సిన అవసరాన్ని వివరించారు. పంటకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో అందించడం ద్వారా అనవసర ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని, నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ పంటల దిగుబడిని మెరుగుపరచవచ్చని తెలిపారు. శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయ ఖర్చులను నియంత్రించుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని సూచించారు.

రైతుకు చేయూత.. దేశ వ్యవసాయానికి బలోపేతం

ఈ కార్యక్రమం ద్వారా పీఎం-కిసాన్ పథకానికి సంబంధించిన సమాచారాన్ని రైతులకు చేరవేయడంతోపాటు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన పెంపొందించారు. ప్రభుత్వ ఆర్థిక సహాయ పథకాలు, వ్యవసాయ పరిశోధనలు, శాస్త్రీయ సాగు విధానాలు సమన్వయంతో ముందుకు సాగినప్పుడే రైతుల ఆదాయ భద్రతకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మరింత దోహదం చేస్తాయని కార్యక్రమంలో వివరించారు.

ఉమ్మడి పాలమూరు జిల్లా మొత్తం కరువు జిల్లాగా ప్రకటించాలి

- **పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి**
- **రాబోయే యాసంగి పంటకు కూడా రైతులకు పరిహారం చెల్లించాలి**
- **సాయం అందించకపోతే రైతులతో సెక్రటేరియట్ ముట్టడిస్తాం**

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్..

నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి పంట నష్టపరిహార సహాయం అందించకపోతే రైతులతో కలిసి సెక్రటేరియట్ ముట్టడిస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాలలో ఉమ్మడి జిల్లాలో 15 మండలాలను ప్రకటించకపోవడం దారుణమని మండిపడ్డారు. 15 మండలాలలో రైతులు ప్రజలు సాగునీరు తాగునీరు అందించాలని ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువును ప్రకటించడం కాదని అధికారులతో సమీక్షలు జరిపి రైతులకు పంట నష్టపరిహారం అందించడంతో పాటు ప్రజలకు నిత్యవసర వస్తువులను కరువు సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కరువును ఎదుర్కొనేందుకు సమీక్షలు జరిపి రైతులకు పరిహారం అందించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం వల్ల ప్రజల ఇబ్బందులను తీర్చడం జరిగిందని గుర్తు చేశారు. హెచ్చరికలు జారీ చేయడం కాదని సహాయం అందించి చిత్తశుద్ధిలో నిరూపించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఎత్తైన ప్రాంతంలో చెంచు పెంటలు త్రాగునీరు అందక కుటుంబం కుటుంబం తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి పైప్లైన్ ద్వారా తాగునీటిని అందించామని తెలిపారు సోలార్ వ్యవస్థను బలోపేతం చేసి పెంటలలో 24 గంటలు నీటిని అందించామని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వం బేషజాలకు పోయి ప్రాజెక్టుల ద్వారా నీటిని కూడా నింపడం లేదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 2300 చెరువులను ప్రాజెక్టుల నీటి ద్వారా నింపి భూగర్భ జలాలను పెంచడం వల్ల త్రాగునీటి సమస్య ఏర్పడలేదని ప్రస్తుతం అన్ని ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలను ఉందన్నారు తాము పశుగ్రాసం కొరత ఏర్పడకుండా రైతులకు 50 శాతం సబ్సిడీతో విత్తనాలను సరిపడా చేశామని కరోనా సమయంలో కూడా ప్రజలను ఆదుకున్నామన్నారు. 13 లక్షల కిలోమీటర్లు పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించడం వల్ల 2014-15లో కోటి ఎకరాల వ్యవసాయం పెరిగిందని వివరించారు.. తెలంగాణ సాగునీటిపారుదల శాఖలో అడ్వైజరిగా ఆంధ్ర ప్రాంతం అధికారి ఉండటంవల్ల ప్రాజెక్టులు పూర్తి కావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం పనులను ముమ్మరం చేయాలని విద్యుత్ సమస్యలు పరిష్కరించడం తోపాటు సాగు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. పట్టాభద్రులైన ప్రతి ఓటరు తమ వివరాలను ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని కోరారు.ఈ సమావేశం లో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య మాజీ జడ్పిటిసి శ్రీశైలం కౌన్సిలర్లు గంగాధర్ జేపీ చారి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు షఫీ ఉల్లా ఖాన్, కేశవులు గౌడ్,శంకర్ గౌడ్, కురుమయ్య, కిషోర్ గౌడ్, టింకు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తమా ఉన్నవారికి ఫ్లూ సమస్య వస్తే.. అది సాధారణం కాదు..
కచ్చితంగా జాగ్రత్త వహించాల్సిందే..



ఆస్తమాతో బాధపడేవారికి ఫ్లూ అనేది కేవలం కొన్ని రోజుల పాటు జ్వరం, అలసట కలిగించే సాధారణ అనారోగ్యం మాత్రమే కాదు. ఇది శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని పెంచడం, నిరంతర దగ్గుకు కారణమవడం, తీవ్రమైన ఆస్తమా దాడులకు దారితీయడం వంటి సమస్యలను కలిగిస్తుంది. కొన్నిసార్లు అత్యవసర వైద్యం లేదా ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి కూడా వస్తుంది. అందువల్ల ఏడాది పొడవునా ఆస్తమాను అదుపులో ఉంచుకోవడానికి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు రాకుండా జాగ్రత్తపడడం చాలా ముఖ్యం. దేశంలో లక్షలాది మంది ఆస్తమాతో బాధపడుతున్నప్పటికీ, ఈ వ్యాధిని ఇప్పటికీ చాలామంది గుర్తించలేకపోతున్నారు. ఇండియన్ గ్లోబల్ ఆస్తమా నెట్‌వర్క్ అధ్యయనం ప్రకారం, ప్రస్తుతం శ్వాస తీసుకునేటప్పుడు పిల్లికూతల వంటి శబ్దం ఎదుర్కొంటున్న వారిలో దాదాపు 82 శాతం మందికి ఆస్తమా ఉన్నట్లు నిర్ధారణ కాలేదు. అలాగే తీవ్రమైన ఆస్తమా లక్షణాలు ఉన్నవారిలో సుమారు 70 శాతం మందికి కూడా ఈ వ్యాధి ఉన్నట్లు తెలియలేదు. అంటే చాలామంది తమకు ఎదురవుతున్న శ్వాస సంబంధిత సమస్యలకు అసలు కారణం ఏమిటో తెలుసుకోకుండానే ఏళ్ల తరబడి జీవిస్తున్నారు. జలుబు చేసిన ప్రతిసారీ తరచూ పిల్లికూతల వంటి శబ్దంతో శ్వాస తీసుకోవడం, క్రమం తప్పకుండా ఇన్‌హేలర్లు వాడడం, గతంలో ఛాతి ఇన్ఫెక్షన్లు లేదా న్యుమోనియా రావడం, వృద్ధాప్యంలో ఆస్తమాతో బాధపడడం వంటి పరిస్థితులు ఉన్నవారు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

శరీరంలోనూ ప్రభావాలు..

ఆస్తమా ఉన్నవారికి ప్రధానంగా ఎదురయ్యే సమస్య ఇన్ఫెక్షన్ మాత్రమే కాదు, దాని కారణంగా శరీరంలో కలిగే ప్రభావాలు కూడా. ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఇప్పటికే సున్నితంగా ఉన్న శ్వాసనాళాల్లో వాపును మరింత పెంచుతుంది. దీనివల్ల ఆస్తమా లక్షణాలు తీవ్రమవుతాయి. సాధారణంగా ఆస్తమా అదుపులో ఉన్నవారికి కూడా ఫ్లూ సోకిన తర్వాత అకస్మాత్తుగా శ్వాస సంబంధిత సమస్యలు పెరుగుతాయి. తీవ్రమైన ఆస్తమా దాడులు వస్తే నోటి ద్వారా తీసుకునే స్టెరాయిడ్ మందులు అవసరం అవుతాయి. అనుకోకుండా వైద్యుడిని సంప్రదించాల్సి వస్తుంది. అత్యవసర చికిత్స లేదా ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతుంది. ఈ సమస్యల నుంచి పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాలు పడుతుంది. ఇన్ఫెక్షన్ తగ్గిపోయిన తర్వాత కూడా రోజువారీ జీవనంపై ప్రభావం కొనసాగుతుంది. అందుకే ముందస్తు నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

'ఛావా' డైరెక్టర్ నుంచి మరో బయోపిక్..
ఆకట్టుకుంటున్న 'ఈఠా' ట్రైలర్

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఈఠా'. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. 'ఛావా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

మహారాష్ట్ర జానపద సంస్కృతిలో భాగమైన లావణీ నృత్యంలో ఆరితేరిన విఠాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ మహిళా కళాకారిణి తన ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఇందులో కళ్లకు కట్టినట్టు చూపించారు. ఇది శ్రద్ధా కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయే పాత్ర అవుతుందని అంచనా వేస్తున్నారు.ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హుడా కూడా ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

పాక్‌లోనూ 'రామాయణ' ఫీవర్..
రణ్‌బీర్ సినిమా కోసం కరాచీ హిందువుల పూజలు..

భారతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన చిత్రం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్'. దర్శకుడు నితీశ్ తివారీ రూపొందించిన ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అంచనాలు పెరుగుతున్నాయి. కేవలం మన దేశంలోనే కాకుండా, సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోనూ ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. తాజాగా పాకిస్థాన్‌లోని కరాచీలో నివసిస్తున్న హిందూ సమాజం ఈ సినిమా విజయం కోసం ప్రత్యేక వేడుకలు నిర్వహించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

స్థానిక యూట్యూబర్ షేర్ చేసిన ఒక వీడియోలో.. కరాచీలోని హిందువులు 'రామాయణ' సినిమా పోస్టర్‌ను పట్టుకుని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. డప్పులు, సంప్రదాయ సంగీతం, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం కరాచీలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణ ఆలయానికి చేరుకుని, అక్కడ సినిమా పోస్టర్‌ను ప్రదర్శించి, చిత్రం ఘన విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన పాత్రధారులైన రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమే కాకుండా, ఆస్కార్ అవార్డును కూడా గెలుచుకోవాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకల ద్వారా తమ సంతోషాన్ని, సినిమా బృందానికి శుభాకాంక్షలను పంచుకుంటున్నామని వారు తెలిపారు. "పాకిస్థానీ హిందువులమైన మాకు, రామాయణ కేవలం ఒక సినిమా కాదు. దాని కథ, సాంస్కృతిక ప్రాముఖ్యత మా సంప్రదాయాలతో, తరతరాల వారసత్వంతో మమ్మల్ని కలుపుతుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం" అని ఆ వీడియోలో పేర్కొన్నారు.

మరోవైపు, ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రీమియర్ షో తర్వాత 'రామాయణ' సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. సినిమా చూసిన పలువురు లెటర్‌బాక్స్‌డ్‌లో తమ రివ్యూలను పంచుకున్నారు. నటీనటుల ప్రదర్శన, సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్, భావోద్వేగ సన్నివేశాలను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటన ఎంతో స్వచ్ఛంగా ఉందని, రావణుడిగా యశ్ నటన సినిమాకే హైలైట్‌గా నిలిచిందని కొనియాడారు. చాలా మంది ప్రేక్షకులు ఈ సినిమాకు ఫైవ్ స్టార్ రేటింగ్స్ ఇస్తూ, పౌరాణిక గాథను తెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.

నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్', దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటించారు.

చక్కనమ్మ చిక్కిందా?

బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు

9వ నెలలోనూ సమంత వర్కౌట్లు..

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'చ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో సమంత గతంలోనే వివరించారు.

"ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరం చెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు

గొప్ప సందేశాన్నిచ్చే సినిమా

యువన్‌కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్, మనస్విని భాగ్యరాజ సమర్పణలో కార్తీక్ భాగ్యరాజ రచన, దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్'. ఈ చిత్రంలో సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు, గీతా భాస్కర్, చైత్ర ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని నవంబర్ 20న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ "ఆస్ట్రోనాట్ అవ్వాలనే కోరిక ఉండటం, ఆ కోరిక చుట్టూ కథను తీయడం బాగుంది. ఇది చాలా మంచి ప్రయోగం. ఎవరైనా సరే ఎంత పెద్ద కలలైనా కనొచ్చు, వాటిని సాకారం చేసుకోవచ్చు అనే గొప్ప సందేశాన్ని ఇచ్చేలా సినిమాని రూపొందించారు"అని అన్నారు. కమల్ కామరాజ్ మాట్లాడుతూ "కథకు ప్రాధాన్యమున్న చిత్రమిది. అందరికీ స్ఫూర్తినిచ్చే చిత్రమిది"అని తెలియజేశారు. సౌమిత్ మాట్లాడుతూ "డియర్ ఆస్ట్రోనాట్' చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రేక్షకులు అందరి పాత్రలతో ప్రయాణం చేస్తారు. మా సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రేయసి సేన్, శరణ్య ప్రదీప్, గీతా భాస్కర్, గడ్డం వీరు, మార్తాండ్ కె వెంకటేష్, కార్తిక్, కృష్ణవేణి, మేఘన పాల్గొన్నారు.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888